# తెలుగు వాణి

వాషింగ్టన్ తెలుగు సమితి సభ్యులకు జయ నామ సంవత్సర

శుభాకాంక్షలు.

## వాషింగ్టన్ తెలుగు సమితి

వసంతపు కోకిల పాట సిగ ముడుచుకొని,

చైత్ర మాసపు సరి కొత్త సొగసు చీర కట్టుకొని,

పుడమిన బుట్టిన కొంగొత్త మట్టి పారాణి పెట్టుకొని,

నుదుట సింధూరమై దిద్దుకున్న రంగవల్లుల సాక్షిగా...

చేదు లేని తీపికి విలువెక్కడిదని... కష్టం లేని సుఖమేపాటి అని...

వాడిన చెట్టు విరియక మానదని... ఓడిన మనిషికి గుర్తు చేయాలని ....

విరిసే మొగ్గలో అందం ఉందని... గెలిచిన జీవితంలో ఆనందపు పాలు

అధికమని ...

అన్ని రుచులు కలిసిన పండగ ఉగాది అని... మనమందరు కలిసి

ఉండటమే ఏ పండగకైనా పరమార్థమని

నడచి వచ్చే నా ఉగాది వెన్నెల!

సంతసింపజేయ సియాటెల్ తెలుగు  జనుల....

అందరికీ శ్రీ జయ నామ సంవత్సర శుభాకాంక్షలు... మీ ఆశలు ఆకాంక్షలు ఈ

యేడు నెరవేరాలని కోరుకుంటూ...

– మీ వాషింగ్టన్ తెలుగు సమితి

# వాషింగ్టన్ తెలుగు సమితి

తెలుగు వాణి - ఉగాది సంచిక (2014)

EDITOR

*board@watsweb.org*

DISCLAIMER

*Opinions expressed in WATS TeluguVani are those of the authors and not of WATS.*

PRINTED BY

*Shakeb Baig*, (206)769-6666

*

*WATS tried to be as objective as possible while publishing this magazine, however please note that any omissions/faults were purely coincidental and humane error but not intentional.*

## ఈ సంచికలో...

1. 2014 - తెలుగు సమితి కార్యవర్గము - సందేశము ..... .........4

2. గణేశ ప్రార్థన ............................................................8

3. ఉగాది చారిత్రక విశిష్టత..................................................9

4. WATS తెలుగు బడి విశేష వీచిక...................................10

5. WATS సంకీర్తనం విశేష వీచిక.......................................11

6. మన తెలుగు విశిష్ట నటులు—అక్కినేని వారు!..................12

7. తెలుగు పద బంధం ...................................................14

8. వసుధైకకుటుంబం (కథ)............................................15

9. బాల వినోదిని ........................................................19

10. 'మాయ'- నారద మహర్షి కథ.......................................22

11. రాశి ఫలాలు ...........................................................24

12. కవితా సంకలనం......................................................27

13. మన పిల్లల పండగ ముచ్చట్లు.....................................28

14. నా తెనుంగు తేట వెలుగుల తెలుగు..............................33

15. వ్యాపార ప్రకటనలు ..................................................34

16. పండగ రుచులు........................................................37

17.WATS-2013 పునర్విమర్శ(చిత్ర మాలిక)......................39



# అనిల్ రెడ్డి

(గౌరవ అధ్యక్షులు)

అధ్యక్షుడయి నూతన సంవత్సరమున్ అడుగిడ,

ఇనుమడింప జేయ మన తెలుగు సమితి ప్రతిష్ట,

ఎగురవేయ తెలుగు బావుటా దిగంతాల నడుమ,

**అనిల** వేగమున సేవా కార్యక్రమముల అందించనెంచ,

ఆహోరహము శ్రమించ అంకిత భావమున

సియాటెల్ తెలుగుల ఒక్కటిగా జేర్చ...

జయము జయమని జయనామ

సంవత్సరం జరగవలే అందరి ఇంట!

Ω

## ప్రియమైన తెలుగు బంధువులకు,

ఉగాది పచ్చడి తడి ఆరక మునుపే, WATS కార్యవర్గం తరపున మీకందరికి జయ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు. మీ అందరి సేవకు నాకు WATS అధ్యక్షుడిగా అవకాశమిచ్చిన మీకు నా కృతజ్ఞతలు. 2013 మనకు బాగా గుర్తుంచుకోదగిన సంవత్సరం. WATS ద్వారా జరిగిన అన్నీ కార్యక్రమాలు విజయవంతం అవ్వటం ఒకటే కాక వాటి విజయానికి కారణమయిన మన తెలుగు బంధువుల సహాయ సహకారాలు ఎన్నటికీ మరవలేనివి. మేము మీ అందరి విలువయిన అభిప్రాయాలను గౌరవించి ప్రతి కార్యక్రమాన్ని సరైన సమయానికి ప్రారంభించటం, ఇలా ఇంకా ఎన్నో చేయగలిగాము. అందరికీ నచ్చేలా, అత్యుత్తమ విలువలతో కూడిన సంస్థను మాకు అందించిన పూర్వపు బోర్డు అందరికీ పేరు పేరున ధన్యవాదాలు తెల్పుతూ అదే ప్రామాణీకముగా మేము మా ప్రయాణం ఈ సంవత్సరము సంక్రాంతి సంబరాల రూపంలో చాలా గొప్పగా ప్రారంభించాము. ఎన్నడూ చూడని సంఖ్యలో అతిథులు విచ్చేసి మన సంస్థ మీద ఉన్న నమ్మకాన్ని మరింత బలపరిచారు.

ఇప్పుడు మన స్వరాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలు అందరినీ ఎంతో కొంత కలవరపాటుకు గురి చేసాయనటం వాస్తవం. ఏది ఏమైనప్పటికి ప్రవాసులమయిన తెలుగు వారందరము కలిసి ఉండటమే అన్నీ విధములుగా అందరికీ ఉపయోగము. ఇంత దూరం బంధు మిత్రులను వదిలి ఉద్యోగ వ్యాపార రీత్యా వచ్చి మన తరువాతి తరానికి మనం అందించవలసిన వారసత్వం వ్యక్తుల కంటే ఉన్నతమైనది. మన తెలుగు జాతి ఎదుగుదల మన ముందు ఎన్నో సవాళ్లను ఉంచింది. మనం నడుపుతున్న తెలుగుబడి మరియు సంకీర్తనంతో పాటుగా సేవ మరియు పరివర్తనం అను కొత్త కార్యక్రమాలను ప్రారంభించాము. వ్యక్తిగతంగా వీటి విజయనికి దోహద పడుతున్న ప్రతి ఒక్క వాలంటీరుకు నా హృదయపూర్వక నమస్కారాలు. నిబద్దతతో వార వారం తెలుగు బడి మరియు సంకీర్తనం కు సేవ చేస్తున్న వాలంటీర్లకు కార్యవర్గపు తరుపున మళ్ళీ ఇంకోసారి ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను. ఈ విజయం వెనక ఉన్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తు మీ సహాయ సహకారాలు ఎల్లప్పుడు మాకు ఉండాలని కోరుకుంటూ, మిమ్ములను అందరినీ ఈ సంస్థలో భాగస్వాములు కమ్మని ఆహ్వానాన్ని తెలుగు వాణి ముఖంగా మీకు **తెలియపరుస్తున్నాను. మరి ఒక్క సారి మీకు అందరికీ ఉగాది శుభాకాంక్షలు మరియు సీత హనుమత్సమేత శ్రీ రామ అనుగ్రహ ప్రాప్తిరస్తు!**

మీ అనిల్ రెడ్డి



## వంశీ కృష్ణ కంచరకుంట్ల

గౌరవ ఉపాధ్యక్షులు

తెలుగు సమితికిన్ యువ నాయకుడపై
నిలచి,

ఉపాధ్యక్ష పదవికిన్ ప్రశస్తిన్ దెచ్చి,

తెలుగు సమితిన్ సర్వులకు సమీపమున
గొని తెచ్చేడి,

మధుర **వంశీ** గానమున్ పలికింప
యశస్విపై వర్ధిల్లవలెనంచు జనులెల్ల
అభిలషించ!

జయము జయమని జయనామ
సంవత్సరం జరగవలే అందరి ఇంట!

Ω

## ప్రియాతి ప్రియమయిన తెలుగు సదస్యులకు,

"ఏ దేశమేగిన ఎందు కాలిడిన పొగడరా నీ తల్లి తెలుగు వెలుగుని" అనెడి స్ఫూర్తితో ఆహోరహం నడిచే నడిపించే తెలుగు సమితి సభ్యులందరికి ఇవే మా నమస్సుమాంజలులు. తెలుగు వాణి ద్వారా ఈ సందర్భంగా మిమ్మల్ని ఇలా కలవటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ముందుగా మీకందరికి జయ నామ సంవత్సర ఉగాది పర్వ దిన శుభాకాంక్షలు. ఈ వత్సరం మీకు అందరికీ ఆ సాయినాధుని ఆశీస్సులు లభించాలని ప్రార్థిస్తున్నాను.

ఈ సంధర్భంగా మీకందరికి మన WATS సంస్థ ఇటీవల సాధించిన విజయాలను ఒక సారి గుర్తు చేద్దాం అని అనుకొంటున్నాను. మన తెలుగు సమితి దాదాపు 600 మంది సభ్యులను కలిగి ఉండి ప్రవాస తెలుగు సమిష్టి తత్వానికి ప్రతీకగా వెస్ట్ యునైటెడ్ స్టేట్స్లో వెలుగుతోంది. ఇదే విధముగా సాటి తెలుగు వారికి చేయూత అందించటంలో కూడా మన సంస్థ ముందుంటుందన్న విషయానికి మార్చిలో జరిగిన లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ ఫండ్ రైజింగ్ ఒక చిన్న నిదర్శనం. దాదాపు 10000$ తోడ్పాటును మనం రామాచారి గారికి చిన్న పిల్లలకు ఉచితంగా సంగీతం నేర్పేందుకు అందించగలిగాం. ఎన్నడూ లేని విధముగా సంక్రాంతి సంబరాలకు తరలి వచ్చిన తెలుగు జన వాహిని సియాటెల్లో ఇప్పటివరకు ఎవ్వరూ చూడనిది. వీటన్నింటికి కారణమయిన వాలంటీర్లకు మరియు మీకు పేరు పేరున తెలుగు సమితి తరపున ధన్యవాదములు.

చివరగా గీతలో కృష్ణ భగవానుడి ఉపదేశానుసారం మనందరి పయనం నీ నా లను వదిలి మన అనే వసుధైక కుటుంబపు మూలాల వైపుగా ఉండాలన్నది జయ నామ సంవత్సరపు WATS ప్రధాన సంకల్పం. ఇదే విధముగా మనము అందరమూ కలిసి ప్రారంభించుకున్న సేవ, పరివర్తనం, తెలుగు బడి, మరియు సంకీర్తనం లాంటి కార్యక్రమాలను మీకు మరింత చేరువగా మరియు ఉపయోగకారిగా మార్చటమే నా ప్రధాన విధిగా నెంచి ఈ నూతన సంవత్సరంలోకి అడుగెడుతూ అందుకు మీ సహాయ సహకారాలు ఎప్పటిలా ఎల్లపుడూ నాకు, మా కార్యవర్గానికి ఉంటుందని ఆశీస్తు...

మీ వంశీ కృష్ణ

# తెలుగు సమితి కార్యవర్గము - సందేశము

(ఈ సంవత్సరపు మీ WATS కార్యవర్గపు పరిచయ వాక్యాలు)



## రాజ్ మందాడి

గౌరవ కార్యదర్శి

సర్వ మోదమున సమితిన్ నడిపి, సర్వ సభ్యులన్ జేర్చి

చర్చలన్ జరిపి, సమస్త కార్యములన్ చక్కబెట్టి... సమితి

సభ్యుల సంతసమున సదా కొలువిడ... **జయము జయమని**

**జయనామ సంవత్సరం జరగవలె అందరి ఇంట!**



## రామ్ కొట్టి

గౌరవ సాంస్కృతిక కార్యదర్శి

తెలుగు తనమున్ ఉట్టి పడునట్టి కార్యక్రమములన్ జేసి,

లెస్స పలికితివనిన్ జనులెల్ల కరతాళములకున్ పని చెప్ప,

**జయము జయమని జయనామ సంవత్సరం**

**జరగవలె అందరి ఇంట!**

# తెలుగు సమితి కార్యవర్గము - సందేశము

(ఈ సంవత్సరపు మీ WATS కార్యవర్గపు పరిచయ వాక్యాలు)

## భాస్కర్ గంగిపాముల    కోశాధికారి



సరి కొత్త సభ్యులన్ జేర్చి సమితి సమ్మతమున, లెక్కలన్ చక్కగా కూడి, తీసివేతలన్ తీరుగా చేసి, తీరుబడిగా సమితి ఖజాన కనిపెట్టుకోగా...**జయము జయమని జయనామ సంవత్సరం జరగవలే అందరి ఇంట!**

## వెంకట నాగరాజ్    వెబ్ మాస్టర్



అంతర్జాలపు చిరునామాపై సమితి మది ఆవిష్కరింపగ, ముదముగా విశేషములు మన మెయిల్ బాక్స్ చేర్చగా, ముఖ పుస్తకమున్ సమితి విశేషముల్ ప్రచురింపగ... **జయము జయమని జయనామ సంవత్సరం జరగవలే అందరి ఇంట!**

## రఘు ప్రసాద్    సాహిత్య కార్యదర్శి



తెలుగు వాణిన్ కూర్చి, తెలుగు బడిన్ తీర్చి, మన భాషను మన పిల్లల జేర్చి, రేపటి తెలుగుల వెలుగు తరాన్ని తారల నడుమ నిలుపగ... **జయము జయమని జయనామ సంవత్సరం జరగవలే అందరి ఇంట!**

# గణేశ ప్రార్థన

పురాణ ప్రకారముగా గణనాథుని పూజ అన్ని కార్యములకు ఆద్యము. ఆ పార్వతి తనయుని ఒకసారి స్మరించుకుందాం...

శుక్లాంబరధరం విష్ణుం - శశివర్ణం చతుర్భుజం...

ప్రసన్న వదనం ధ్యాయేత్ - సర్వ విఘ్నోపశాంతయే

***

గజాననాయ గాంగేయ సహజాయ సదాత్మనే... గౌరీప్రియ తనూజాయ గణేశాయాస్తు మంగళమ్

నాగయజ్ఞోపవీతాయ నత విఘ్నవినాశినే... నంద్యాది గణనాథాయ నాయకాయాస్తు మంగళమ్

ఇభవక్త్రాయ చ ఇంద్రాది వందితాయ చిదాత్మనే... ఈశాన ప్రేమ పాత్రాయ చేష్టదాయాస్తు మంగళమ్

సుముఖాయ సుశుండా గ్రోత్ క్షిప్తామృత ఘటాయ చ,.. సురబృంద నిషేవ్యాయ సుఖదాయాస్తు మంగళమ్

చతుర్భుజాయ చంద్రార్థ విలాసన్మస్తకాయచ,... చరణావనతానంత తారణాయాస్తు మంగళమ్

వక్రతుండాయ వటవే వన్యాయ వరదాయ చ,... విరూపాక్ష సుతాయాస్తు విఘ్ననాశాయ మంగళమ్

ప్రమోదామోదరూపాయ సిద్ధి విజ్ఞాన రూపిణే... ప్రకృష్ట పాపనాశాయ ఫలదాయాస్తు మంగళమ్

మంగళం గణనాథాయ మంగళం హరసూనవే... మంగళం విఘ్నరాజాయ విఘ్నహర్త్రేస్తు మంగళమ్

శ్లోకాష్టమిదం పుణ్యం మంగళ ప్రదం మాదరాత్... పఠితవ్యం ప్రయత్నేన సర్వవిఘ్న నివృత్తయే

ఇతి గణేశ మంగళాష్టకమ్

***

వక్రతుండ మహాకాయ సూర్యకోటి సమప్రభా...

నిర్విఘ్నం కురుమేదేవ సర్వకార్యేషు సర్వదా....

**ఓం శ్రీ గణాధిపాయ నమః!**

# ఉగాది - చారిత్రక విశిష్టత

వెంకట్ నాగరాజు గౌరిసెట్టి (gvnag@live.com)

ఉగాదిని తెలుగు వారందరు కొత్త సంవత్సరానికి ఆద్య దినంగా జరుపుకుంటారు. ఉగాది వసంత ఋతువులో వస్తుంది. ఈ పండుగ పచ్చని వాతావరణాన్ని, ఆనందాన్ని ఆవిష్కరిస్తుంది. అప్పుడే పూస్తున్న చెట్లు, మొగ్గ తొడిగే పూలు, కోయిల పాటలు, చెట్టు నిండా కాచిన మామిడి పిందెలు, మల్లె పూల మాలలు ఉగాది పండుగకు మాత్రమే సొంతమైన విశేషాలు. పురాణ ప్రకారంగా కూడా ఈ పండుగ చాలా ప్రశస్తమయినది. చాంద్రమాన ప్రకారముగా ఈ పండుగను చైత్ర మాసంలో శుక్ల పక్షంలో జరుపుతారు. బ్రహ్మ ఈ చైత్ర శుద్ధ పాడ్యమి నాడే సృష్టి ఆరంభించాడని ప్రతీతి. భారత దేశపు ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త భాస్కరాచార్యుడి లెక్కల ప్రకారం ఇదే రోజున నూతన సంవత్సర ప్రారంభం అవుతుందని చెప్తాయి. ప్రతి ఉగాది కి చంద్ర కక్ష్యలో వచ్చిన మార్పుల వల్ల అందరూ వారి వారి యధాశక్తిన ప్రాతః కాలముననే మేల్కొని మంగళ స్నానాలు చేసి ఇంటి ముందు మామిడి తోరణాలు కడతారు. రంగవల్లులతో ఇంటి ముంగిళ్ళను అలంకరిస్తారు. ఇష్ట దైవాన్ని కలశంతో ప్రతిష్టించుకొని కొత్త సంవత్సరం మంగళకరంగా ఉండవలెనని ప్రార్థిస్తారు. ఉగాది పచ్చడి ఈ పండుగ మరో విశేషం. మామిడి, బెల్లం, మిరప, ఉప్పు, చింత పండు, వేప పూలు కలిపి చేసే ఈ పచ్చడి ప్రతి ఒక్కరి జీవితంలోని మంచి, చెడు, బాధ మరియు సంతోషానికి చిహ్నాలుగా కలిపి నైవేద్యంగా దేవుడికి సమర్పించి అందరికీ పంచుతారు. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి ఇస్తుంది. ఋతు మార్పు కారణంగా వచ్చే వాత, కఫ, పిత్త దోషాలను హరించే ఔషధంగా ఉగాది పచ్చడి తినే ఆచారం ఆరంభమైంది అంటారు. ఈ పచ్చడిని శ్రీరామ నవమి వరకు తినాలని శాస్త్రాలు చెబుతున్నాయి.

**త్వామష్ట శోక నరాభీష్ట, మధుమాస సముద్భవ**
**నిబామి శోక సంతప్తాం, మమ శోకం సదా కురు||**

ఈ మంత్రం చదువుతూ ఉగాది పచ్చడి తినాలని శాస్త్రాలు చెప్తున్నాయి.

ఉగాది పచ్చడి ఆహారంలో ఉండే ఔషధ గుణాన్ని, వృక్షసంరక్షణ అవసరాన్ని, ఆయుర్వేదానికి ఆహారానికి గల సంబంధాన్ని చెప్పడమే కాక పండుగలకు, ఆచారాలకు, సముచిత ఆహారానికి గల సంబంధాన్ని చాటిచెప్తుంది. ఈ పండుగను ఒక్క తెలుగు వారే కాక మహారాష్ట్ర కర్నాటక మరియు మిగితా కొన్ని రాష్ట్రాల్లో కూడా జరుపుకుంటారు. మహారాష్ట్రలో ఈ పండుగను గుడిపడ్వా అని పిలుచుకుంటారు. ఇహ పూజ పునస్కారాలు అయ్యాక పులిహోర, బొబ్బట్లు, మామిడి కాయలతో చేసే పండగ పిండి వంటలు ప్రతి తెలుగింట్లో సర్వ సాధారణం. మహారాష్ట్రలో పూరన్ పోలి అనే వంట ఈ పండుగ స్పెషల్. పంచాంగ శ్రవణం ఇంకొక ఉగాది విశిష్టత. సంవత్సరపు మొదటి రోజున పండితులు ప్రతి ఒక్కరి సంవత్సరం ఎలా ఉండబోతుందో శాస్త్రయుక్తం గా వినిపిస్తారు. అందరూ వారి వారి రాశులను, వాటి ఫలితాలను తెలుసుకోవటం ఉగాది నాడు చూస్తూనే ఉంటాం. ఈ మధ్య కాలంలో ప్రతి టివి చానల్ వీటినే ఉగాది పగలంతా ప్రసారం చేస్తూ ఉంటున్నారు. ఈ ఉగాది నాడు కవి సమ్మేళనాలు కూడా ఇంకొక విశిష్టత. సంవత్సరమంతా ఈ రోజు కోసం కవులు ఎదురు చూస్తూ ఉంటారంటే అతిశయోక్తి కాదేమో! పాల్గొనే వారికి ఇదొక విందు భోజనం ఇక వీటిని చూసే వారికి ఇది ఒక సాహితి సంరంభం. కొత్తగా ఏర్పడిన పార్టీల నుంచి మొదలుకొని, ఇంట్లో భార్య వండి పెట్టిన ఉగాది బొబ్బట్లు దాకా కాదేదీ కవితకనర్హం అని అన్నిటి మీద తెలుగు బాష మీద తమకున్న పట్టును ప్రదర్శనకు పెట్టేస్తారు. ఇక అప్పుడప్పుడే తెలుగు సాహిత్యంలో అడుగు పెడుతున్న కవులకు ఈ ఉగాది కవి సమ్మేళనాలు మంచి ప్రయోగ శాలలు మరియు గుర్తింపు తెచ్చి పెట్టే సరయిన వేదికలు. ఆకశవాణి లో ఇప్పటికీ పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం సూపర్ హిట్ కార్యక్రమాలు!

**ఈ ఉగాది మీకు అందరికీ శుభాన్ని, ఆరోగ్యాన్ని మరియు ఐశ్వర్యాన్ని అందివ్వాలని ఆ సర్వేశ్వరున్ని ప్రార్థిస్తూ… సర్వే జనా సుఖినోభవంతు… సమస్తా సన్మంగళానిభవంతు!**

# WATS తెలుగు బడి - విశేష వీచిక

మన తెలుగును తర తరాలకు అందిద్దాం! తెలుగు వెలుగులు దశ దిశలా చాటుదాం...

నిస్వార్థపూరితంగా , నిబద్ధత తో విధిగా వారం వారం తమ విలువయిన సమయాన్ని కేటాయిస్తూ తెలుగు భాషా సేవలో నిమగ్నమయిన వాలంటీర్లకు ఇవే తెలుగు వారందరి తరపున శుభాభినందనలు.

## వేద టెంపుల్ - REDMOND

రామ్ కొట్టి
కల్యాణ్ కాకి
అను గోపాళం
వరలక్ష్మి ఆకెళ్ళ

## HTCC టెంపుల్ - BOTHELL

మనోజ్ చింతిరెడ్డి
అనూరాధ కుంతం
బాల పి యస్
రఘు ప్రసాద్ బి ఆర్

తెలుగు బడి అన్ని కేంద్రాలలోను శని వారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు నడపబడుచున్నవి.


మరిన్ని వివరములకు సంప్రదించండి - literary@watsweb.org

తెలుగుబడి 2014-2015కు మీ పిల్లలను పంపదల్చుకుంటే నేడే నమోదు చెయ్యండి. దీని కొరకు మా వాలంటీర్లను కాని పైన తెలిపిన మెయిల్ ను కాని సంప్రదించగలరు .

తెలుగు భాష సేవకు స్వాగతం! మీకు వాలంటీరింగ్ పై ఆసక్తి ఉంటే మమ్మల్ని సంప్రదించండి. సంకీర్తనం మరియు తెలుగుబడి కేవలం వాలంటీర్ల ద్వారా నడపబడుతున్న WATS కార్యక్రమాలు.



దీపావళి నాడు గణ నాథుడికి ఆద్య వందనం సమర్పిస్తున్న తెలుగు బడి చిన్నారులు.


తెలుగు బడి పిల్లల తల్లి తండ్రులతో వాలంటీర్ల ముఖాముఖీ

# WATS సంకీర్తనం - విశేష వీచిక

WATS వారు తెలుగు వారందరికి సగర్వంగా అందిస్తున్న కార్యక్రమం - సంకీర్తనం.

సంకీర్తనం Redmond – వేద ఆలయ ప్రాంగణంలో శని వారం ఉదయం 11 గంటల నుండి 11:30 గంటల వరకు నడపబడుచున్నవి. మరిన్ని వివరములకు సంప్రదించండి – sankeertanam@watsweb.org

సంకీర్తనం 2014-2015కు మీ పిల్లలను పంపదల్చుకుంటే నేడే నమోదు చెయ్యండి. దీని కొరకు మా బోర్డ్ ను కాని పైన తెలిపిన మెయిల్ ను కాని సంప్రదించగలరు. WATS తెలుగు వారందరి తరపున వారం వారం ఎంతో నిస్వార్ధపూరితంగా సంగీత, సమాజ సేవలో నిమగ్నమయిన వాలంటీర్లకు అందరికీ శుభాభినందనలు.

సంకీర్తనం వాలంటీర్స్: **వరలక్ష్మి ఆకెళ్ళ, లాస్య రెడ్డి.**

**సియాటెల్ సంగీతాభిమానులకుకు స్వాగతం! మీకు చిన్నారులకు సంగీతం నేర్పాలనే అభిలాష ఉంటే లేదా వాలంటీరింగ్ పై ఆసక్తి ఉంటే మమ్మల్ని సంప్రదించండి. సంకీర్తనం మరియు తెలుగుబడి కేవలం వాలంటీర్ల ద్వారా నడపబడుతున్న WATS కార్యక్రమాలు.**

Ω




సంకీర్తనంలో పిల్లలతో వాలంటీర్లు.....

# మన తెలుగు విశిష్ట నటులు-అక్కినేని వారు!

అనురాధ గోపాళం(agopalam@hotmail.com)



దసరా బుల్లోడుగా చిందులేసినా, బుద్ధిమంతుడుగా మురిపించినా, దేవదాసుగా అలరించినా అక్కినేని నటన అనన్యసామాన్యం. క్రిష్ణాజిల్లా వెంకటరాఘవాపురంలో 1924, సెప్టెంబరు 20న వెంకటరత్నం, పున్నమ్మ దంపతులకు జన్మించారు. చిన్ననాటినుండే నాటకరంగంపైపు ఆకర్షితుడై అనేక నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించారు. ప్రముఖ చిత్రనిర్మాత ఘంటసాల బలరామయ్య ద్వారా విజయవాడ రైల్వే స్టేషన్లో విధివశాత్తు గుర్తించబడ్డారు. 17 ఏళ్ళ వయసులో తొలిసారి 'ధర్మపత్ని' (1941) లో తెరపై కనిపించారు. అయితే పూర్తి స్థాయి కథా నాయకుడిగా నటించిన మొదటి చిత్రం "శ్రీ సీతారామ జననం" (1944). అప్పటినుండి రకరకాల తెలుగు, తమిళ సినిమాలలో 75 సంవత్సరాల పైగా 256 చిత్రాల్లో నటించిన అక్కినేని తన పుత్రుడు అక్కినేని నాగార్జున మరియు మనవడు నాగచైతన్య తో కలిసి నటించిన "**మనం**" ఆయన  చివరి సినిమా.

ఒక భగ్నప్రేమికుడు, ఒక త్యాగమూర్తి, ఒక అభిమన్యుడు...

స్నేహం కోసం ప్రేమికురాలిని  ప్రేమ కోసం జీవితాన్నే వీడినా, ఆయనకే చెల్లు...

మనసును గాయపరచుకునే ప్రేమైకమూర్తి, గాయాలు మాపే ఆత్మ బంధువు...

తెలుగు సినిమా ప్రపంచపు తిరుగు లేని బాటసారి...

ఆజానుబాహులయిన ఎన్ టి ఆర్,ఎస్ వీ ఆర్ల నడుమ నెగ్గిన బాలరాజు!

సాంఘీకమైన,జనపదమయిన తన లోతు పాతులను ఎరిగిన మనీషి!

రీల్ లైఫ్ హీరో నుంచి రియల్ లైఫ్ దాకా ఒక్కడై ఎదిగిన నిక్కచ్చి తెలుగు హీరో!

సంపూర్ణ జీవితపు సరి కొత్త నిర్వచనమై మన నుంచి నిష్క్రమించిన స్ఫుర ద్రూపి!

అక్కినేని వారి జీవితం ప్రతి తెలుగు వాడికి గర్వించదగ్గ పాఠం, నడవదగ్గ పథం...

మన స్మృతుల్లో వారు వేసిన గురుతులు పచ్చబొట్టులు...

(తెలుగు వారందరి తరపున ఆ మహా నటుడికి, అంత కంటే గొప్ప వ్యక్తికీ ఇదే

WATS నమస్సుమాంజలి)

గ్రామీణ ప్రాంతాలకు అద్దంపట్టే సినిమాలైన బాలరాజు, రోజులు మారాయి, మరియు నమ్మినబంటు లో నటించి, తెలుగు నటసామ్రాట్ గా పేరుపొందారు. మిస్సమ్మ, చక్రపాణి మరియు ప్రేమించుచూడు లాంటి హాస్యరసప్రధాన చిత్రాలలో అందరి మన్ననలందుకున్నారు. 'దసరాబుల్లోడు' ఏయన్నార్ కెరీర్ లో తొలి గోల్డెన్ జూబ్లీ హిట్ గా నిలచింది. ఈ చిత్రం 1971లో సాధించిన సంచలనం అంతా ఇంతా కాదు. 'దసరాబుల్లోడు'గా అక్కినేని అభినయం సాగిన తీరు కూడా అదరహో అనిపించింది. అసలు తెలుగునాట సదరు స్టెప్స్ కు ఓ ఊపు తీసుకు వచ్చిన ఘనత అక్కినేనిదే. లైలామజ్ను, అనార్కలి,బాటసారి, ప్రేమనగర్, ప్రేమాభిషేకం మరియు మేఘసందేశం లో నటన ద్వారా తెలుగుచిత్రరంగానికి విషాదరారాజుగా పేరుపొందారు. దాసరి నారాయణ రావు దర్శకత్వం వహించిన ప్రేమాభిషేకం హైద్రాబాదు లో 533 రోజులు ప్రదర్శించబడి తెలుగు సినిమాలో రికార్డు నమోదు చేసింది.ఇది అంతరాయం లేకుండా 365 రోజులు నడచిన సినిమాల్లో ఒకే ఒక్క తెలుగు సినిమాగా నమోదైంది.

*Cinema is a prolific, pervasive and persuasive medium of mass entertainment. It is a cementing force in a world of stress and strife. It will live forever. The Akkineni Nageswara Rao Award, I hope, will also live forever - celebrating Cinema with honesty and dignity. I, too, wish to live forever with my little deed - My Award.*

*Akkineni Nageswara Rao*



తెలుగు సినిమాలలో ద్విపాత్రాభినయనానికి నాందిపలికిన అక్కినేని నవరాత్రి సినిమాలో తొమ్మిది పాత్రలలో నటించాడు. ప్రేమలో ఓడిపోయి మందుకు బానిసైన ప్రేమికుడిగా దేవదాసు చిత్రంలోని నటన శరత్ చంద్ర నవలలోని కథానాయకుడికి జీవంపోసింది. ఈ పాత్రకు ఆ తర్వాత మరెంతోమంది మరిన్ని భాషలలో నటించినా, ప్రముఖ హిందీ సినిమా నటుడు దిలీప్ కుమార్ అక్కినేని నటించినదే "**ఒకే ఒక దేవదాసు**" అని అన్నాడు. అక్కినేని నటించిన ఏకైక హిందీ చిత్రం 'సువర్ణసుందరి'(1958). ప్రేమకథా చిత్రాల్లో అక్కినేనిదే అందరికంటే పైచేయి, అలాగే పునర్జన్మ, జన్మజన్మల బంధంతో రూపొందిన సినిమాల్లోనూ ఏయన్నార్ చిత్రాలే జనాన్ని ఆకట్టుకున్నాయి. బాలరాజు, మూగమనసులు, బంగారుబొమ్మలు అలా విజయం సాధించిన చిత్రాలే. వాటిలో మూగమనసులు అన్నిటికన్నా మిన్నగా నిలచింది.

అక్కినేని అఖండ విజయాలు అక్కున చేరినప్పుడు పొంగిపోలేదు. పరాజయాలు పలకరించినప్పుడు కుంగిపోలేదు. జానపద చిత్రాల్లో నటించేవాడికి 'దేవదాసు' లాంటి సైకలాజికల్ రోల్ సరిపోతుందా అని గేలి చేసిన వారికి తన అభినయంతోనే సమాధానం చెప్పారాయన. దేవుడంటే ఓ పవిత్ర భావం అంటారాయన. అంతేకానీ రాళ్ళు రప్పలకు మొక్కనంటారు. అందుకే 'విప్రనారాయణ'గా అక్కినేని నటించేటప్పుడు కూడా పలువురు పెదవి విరిచారు. మళ్లీ ఆ పెదవి విరుపులకు తన నటనతోనే సమాధానం చెప్పారు. అక్కినేని పని అయిపోయిందని పలుమార్లు అనుకున్నప్పుడల్లా అద్భుత విజయాలతో అందరినీ ఆశ్చర్యపరిచారాయన. 1991 లో ఆయన నటజీవితం స్వర్ణోత్సవం సందర్భాన విడుదలైన "సీతారామయ్య గారి మనమరాలు", కొత్త మరియు యువనటుల చిత్రాలతో పోటీపడి బాక్సాఫీసు హిట్ గా నిలిచింది.

తెలుగునాట అత్యధిక అవార్డులు అందుకున్న ఏకైక నటుడు అక్కినేని. మూడు ఫిల్మ్ ఫేర్ తెలుగు అత్యుత్తమ నటుడు పురస్కారాలు,చలన చిత్ర రంగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత పురస్కారం దాదా సాహెబ్ ఫాల్కేతో పాటుగా 'పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్' అందుకున్న ఏకైక నటుడు కూడా ఏయన్నారే. 'మేఘసందేశం, బంగారుకుటుంబం' చిత్రాలతో ఉత్తమనటునిగా నంది అవార్డు అందుకున్నారు. వీటితో పాటుగా ఇంకా లెక్కలేనన్ని పురస్కారాలు అందుకున్న మహానటుడు. నటునిగా అరుదైన చరిత్రను సొంతం చేసుకున్న ఏయన్నార్ వ్యక్తిగానూ అదే రీతిన నిలిచారు. హార్ట్ ఆపరేషన్ జరిగి నలభై ఏళ్లయినా చెక్కుచెదరని ఆరోగ్యం ఆయన సొంతమయింది. అందుకు అక్కినేని ఆత్మస్థైర్యమే కారణమంటారు చాలామంది, కాదు తనను అభిమానించేవారి ఆశీస్సులే అసలు కారణమనేవారు అక్కినేని నాగేశ్వరావు.

అక్కినేనితో అన్నపూర్ణ వివాహం 1949 ఫిబ్రవరి 18న జరిగింది. ఆమె పేరుతో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించారు. వీరికి సంతానం 5 గురు, అక్కినేని వెంకట్, అక్కినేని నాగార్జున, సత్యవతి అక్కినేని, నాగసుశీల, సరోజ అక్కినేని. మనిషిగా, సంఘజీవిగా కూడా అక్కినేని తనవంతు కృషి చేశాడు. గుడివాడలోని కళాశాలకు భూరి విరాళమిచ్చినందుకు ఆ కళాశాలకు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు పేరిట ఎఎన్ఆర్ కళాశాల (ANR College) అని నామకరణం చేశారు. తాను చదువుకోలేనందుకే పేదరికంలో ఉన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకారవేతనాలు, విరాళాలు ఏర్పాటు చేశారు. అ ఆలు'-గా 'అక్కినేని ఆలోచనలు' రచన ఎంతో ప్రసిద్ధి.2005లో ఏయన్నార్ నేషనల్ అవార్డు నెలకొల్పారు.

పుట్టడానికి గ్యారెంటీ లేదు. చావడానికి మాత్రం గ్యారెంటీ ఉంది. చనిపోవాలని కోరిక లేదు. కాని చనిపోయే వరకు ఆరోగ్యంగా ఉండాలని ఉంది,ప్రేక్షకులు దీవిస్తే నిండు నూరేళ్ళూ జీవించగలనని ఆత్మవిశ్వాసంతో చెప్పిన ధీరోధాత్తుడైన ఈ హీరో తన 90 వ యేట జనవరి 22వ తేది 2.45 నిముషాలకు తుది శ్వాస విడిచారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపొయినా,తెలుగు వారి మనసులో కలకాలం "నటసామ్రాట్" గ ఎప్పటికీ నిలిచిపోతారు.

**జీవితపు చివరిదాకా సినిమా నటుడిగానే ఉండి సంగీతం వింటూనే శాశ్వతనిద్రకు ఉపక్రమించిన ఆ మహోన్నత వ్యక్తికి, నటుడికి ధృవతారకి తెలుగు జాతి తరపున యిదే మా నివాళి.**

-Ω-



నేను 1998 లో అమెరికా కి వచ్చి స్థిరపడ్డాను.ఖాళీ సమయం లో సినిమా పాటలు వినడం,కొత్త కొత్త వంటలు ఎక్స్ పెరిమెంట్ చెయ్యడం నాకు ఇష్టం.అలాగే మా పిల్లల స్కూల్ లో వాలంటీర్ చెయ్యడం, పిల్లలతో సమయం గడపటమంటే ఇంకా ఇష్టం. నవ్వు నాలుగు విధాలా చేటు కాదు,నలభై విధాల రైటు ,అందుకే నవ్వుతూ బ్రతుకు అని మనస్పూర్తిగా నమ్ముతాను.

# తెలుగు పద బంధం

సింగరాజు నటరాజ శర్మ

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | 3 | | ■ | 4 | 5 | | 6 |
| | ■ | 7 | | ■ | 8 | | | ■ | |
| 9 | 10 | ■ | 11 | 12 | | | ■ | 13 | |
| 14 | | 15 | ■ | 16 | | ■ | 17 | | |
| ■ | 18 | | 19 | ■ | ■ | 20 | | | ■ |
| 21 | ■ | 22 | | ■ | ■ | 23 | | ■ | 24 |
| 25 | 26 | | ■ | 27 | 28 | ■ | 29 | 30 | |
| 31 | | ■ | 32 | | | 33 | ■ | 34 | |
| | ■ | 35 | | ■ | 36 | | 37 | ■ | |
| 38 | | | | | ■ | 39 | | | |

**అడ్డం:**

1. ఇండియా
4. ఇవి ఎవరివి? మొదట దీర్ఘం.
7. తపస్సు చేస్తే దేవుడిచ్చేది – అటునుంచి
8. [5] నిలువుకు వ్యతిరేకం
9. తురక మంత్రి తోక తెగింది
11. Next
13. హద్దు
14. ఒక తంత్రీ వాద్యం
16. దుష్ట చతుష్టయం లో ఒకడు
17. దయ
18. Kerchief
20. Mix
22. పపలు
23. వర్ణము
25. మంచి బుద్ధి గలవాడు
27. How much?
29. టక్కు, ________
31. అటునుంచి ఆలస్యం
32. భాగవతం లో పద్యం, __________ చిడిముడి తడబడ
34. కొప్పు
35. వెళ్ళనని చెప్పు
36. 11 కరణాలలో రెండవది
38. వచ్చుట, వెళ్ళుట
39. క్షీర సముద్రం

**నిలువు:**

1. పోతన పలికినది
2. Generation
3. స్త్రీ దైవం
4. రైళ్లు పూర్వం దీనితో నడిచేవి
5. ఆటంకం
6. త్యాగ గుణం
8. పార్వతి
10. దట్టమైన
12. తల తెగిన పాదుక
13. పురాణాల్లో పర్వతం
15. అన్నవరం దేవుడు
17. పొందుట
19. కిందనుంచి ఎన్నో!
20. హస్తం
21. సంభోధనా ప్రధామా విభక్తి లో సుగుణను రమ్మనండి
24. శ్రీరంగ నాధుడు , కుముదవల్లి – 1,2,3,10,11
26. జల్సా
27. పగలు కాచేది
28. చెంత రావె బాలా – 2,4,6
30. మబ్బు కమ్ముట
32. ముందు కాదు
33. పూర్వ కాలం పిల్లలకు పాలు పట్టడానికి వాడినది – కింద నుంచి
35. వెళ్ళు, వెళ్ళు
37. చేపలు పట్టుటకు విసిరేది

**ఉగాది**

ఆశలు పల్లవించెను చిగురించిన ఆకులవలె మనసులు వికసించెను విరియబూసిన మల్లెలవలెరుచులు ఆరు విధముల కలిసి వచ్చు షడ్ ఋతువులవలెకొత్త రాగాలు పాడెనెదలు ఆమని కోయిలవలెచైతన్యము ఉరకలెత్తె విచ్చేసిన చైత్రము వలె తప్పిపోయెను బాధలు పగలు కానని తారలవలెఉద్భవించెను నవ యుగము దినేశుని ఉదయమువలె తొలి పండుగ పలకరించెను వేసవి తొలకరివలె

**ఉగాది కందం**

అరువది వత్సరములలోఇరువది ఎనిమిదవ ఏడు, ఇటు తరలొచ్చెన్సిరి కల్గున్, జయమగుననివిరజాజుల సెదలలోన విరియగ జేసెన్

**ఉగాది శార్దూలం (మ స జ స త త గ)**

రావమ్మా! జయనామ బాల కుసుమా! రావమ్మ మమ్మేలగన్శ్రీవిద్యా, సిరి, పార్వతీ వరములన్ శీఘ్రంబుగందింపగన్దేవీ రా! మముగావ, బ్రోవ దిగిరా దేశంబు నిన్ కోరగన్సావేరీ కరుణాంతరంగ గనుమా స్వప్నాలు సాధించగన్

- మారుతి తెన్నేరు

**గబ గబా అనండి!**

One-One was a race horse. Two-two was one too.

Ann and Andy's Anniversary is in April.



# వసుధైకకుటుంబం (కథ)

సరళ బులుసు (sarala@hotmail.com) బ్లాగు: http://jivithagati.blogspot.in/

"అమ్మా, పిన్ని ఇండియాకి వచ్చేస్తున్నది. మధు మెయిల్ పంపేడు." అని ఆనందంగా వచ్చి తల్లితో చెప్పేడు హరి. ఇంతలో రావుగారు 'అవును. మధు నాకూ పంపేడు, వాళ్ళమ్మ అమెరికాలో విసుగెత్తి, కొన్నేళ్ళు ఇండియాలో ఉంటానని వస్తోందని, మనకి దగ్గరలో ఇల్లు చూడమని" పేపర్లోనుంచి తలెత్తి అన్నారు. వెంటనే సంతోషంతో కమల అందుకుని, 'పిల్లల పెళ్ళిళ్ళయ్యాయి. విమలకు నిశ్చింత. మళ్ళీ తనకి ఇల్లేమిటి? మధుకి హాయిగా మనతోపాటే వుంటుందని గట్టిగా రాయండి" అంది భర్తతో. కమలపెళ్ళి నాటికి విమల 5సం.ల. పాప. కనుక కమల, రావులిద్దరికీ విమలంటే కన్నకూతురంత ప్రేమ. అందరూ వేచి చూస్తున్న ఆదివారం వచ్చింది. హరి, జ్యోతి ఎయిర్ పోర్ట్ కి వెళ్ళి విమలను అత్యంత ప్రేమగా ఇంటికి తెచ్చేరు. విమల తనవాళ్ళ మనసులు కష్టపెట్టకుండా వేరేఇంట్లోకి ఎలామారడమా ఆలోచించసాగింది. ఇల్లు చూసుకోవటానికి ముందే అక్కవాళ్ళకి చెప్పి ఒప్పించాలి.

మర్నాడు మధ్యాహ్నం హరి, జ్యోతి ఆఫీసులకి వెళ్ళిపోయేరు. విమల, అక్క, బావలతో కూర్చుని టి.వి. చూస్తోంది. విమల నెమ్మదిగా "అక్కా, బావా, మీతో కొంచెం మాట్లాడాలి."అంటూ నసిగింది. "ఏమిటమ్మా! చెప్పు." అన్నారిద్దరూ. "ఏం లేదు, మధు, ఆనంద్ సిటిజన్స్ అయేవరకు నేను ఇండియాలోనే వుండదలుచుకున్నాను. నాలుగేళ్ళు పట్టవచ్చు. పిల్లలిద్దరూ వాళ్ళ కుటుంబాలతో వచ్చి వెళ్తుంటారు. మధు, ఆనందు మాటకేం కాని కోడళ్ళకి 2,3 వారాలు వుండాలంటే యిక్కడ ఫ్రీగా వుండదు. కనుక నేను దగ్గరలో వేరే అపార్ట్ మెంట్ తీసుకుందామనుకుంటున్నాను". అంది విమల. "మాతో పాటు వుంటావని సరదా పడ్డాము కాని నీవు చెప్పిన పాయింట్ నిజం తల్లీ. దగ్గరగా ఏదయినా యిల్లు దొరుకుతుందేమో ప్రయత్నిద్దాం." అన్న రావుని విసుగ్గా చూసిన అక్కను "ఎక్కడున్నా రోజు మిమ్మల్ని కలిసేంత దూరంలో వుంటాను. సరేనా?" అని విమల అక్కకు సముదాయించింది.

మహానగరాల్లో అన్నివిధాల నచ్చిన ఫ్లాట్ కుదరడమంటే మాటలు కాదు. రెండు పోర్షన్లుగా మేడ, క్రింద అద్దెవాళ్ళు, ఇంటివాళ్ళే వుండేవి రావుగారి వీధిలోనే వున్నాయి కాని విమలకు నచ్చలేదు. ఫ్లాట్ గురించి వాకబు చేస్తున్న విమలను, అదే బిల్డింగ్ లో 2వ ఫ్లోర్ బాల్కనీ నుండి ఒక యువతి పిలిచి, '4వ ఫ్లోర్ లో రెండుగదుల ఫ్లాట్ అద్దెకున్నదని' చెప్పింది. సంతోషంగా ముందు గేటు నుంచి విమల వెళ్ళేసరికి ఆఅమ్మాయి ఆహ్వానించి, సొసైటీ ప్రెసిడెంట్ వద్ద ఫ్లాట్ తాళం తెమ్మని వాచ్ మన్ కి చెప్పింది. అతడు విధిలేక తెచ్చి తలుపు తెరిచి చూపేడు. తనక్క వాళ్ళింటికి ప్రక్కవీధిలోనే ఈ ఫ్లాట్, ఇంట్లో ఫ్రిజ్, గ్యాస్ స్టౌ వున్నాయి. జెనరేటర్, లిఫ్ట్, గ్రౌండ్ ఫ్లోర్లో వాచ్ మన్ రాజు కుటుంబం వున్నారు. తనకి ఏ అవసరమయినా మగ, ఆడ దిక్కు వుంటుంది. అద్దె కూడా రీజనబుల్ గా అనిపించింది. విమల యిల్లు నచ్చిందని, రాజుని ఓనర్ ఫోను నెంబర్ అడగగా అతను నసుగుతూ, 'మేడమ్, ఈ ఇంట్లో దెయ్యం వుంది. అందుకే గత మూడేళ్ళుగా యీయిల్లు ఖాళీగా వుంది. చీకటి పడ్డాక నేనే ఈ ఫ్లాట్ లోకి పోను" అన్నాడు. ఆ బిల్డింగ్ లో నాలుగుఫ్లోర్స్, ఫ్లోర్ కి మూడుఫ్లాట్స్. ఫ్లాట్ ఓపెన్ చేసి వుండడం చూసి, ఇతర ఫ్లాట్స్ లో స్త్రీలు బయట వేచివున్నారు విమలకోసం. తను అలాంటివి నమ్మనని, ప్రెసిడెంట్ నడిగి ఓనర్అడ్రస్, ఫోన్ నెంబర్ తెమ్మని అతన్ని పంపి, విమల వరండాలోకి రాగానే బయటకు వేచినవారు గబగబా వచ్చి, ఆమె వివరాలడిగి, "మీరు ఒంటరిగా వుంటామంటున్నారు. ఈ ఫ్లాట్ లో మూడేళ్ళ క్రితం ఓనర్ చిన్నవయసులో హటాత్తుగా గుండెపోటు వచ్చి బాత్రూమ్ లో పోయేడు. అతని భార్య, 5సం.ల. కొడుకుతో మరోచోట అద్దె ఇంటికి వెళ్ళిపోయింది. ఆ ఫ్లాట్ లో రోజూ దెయ్యం రాత్రిపూట తిరుగుతున్న చప్పుళ్ళు వినిపిస్తుంటాయి" అని చెప్పేరు. జీవితమంతా విధికి ఎదురీది రాటుదేలిన విమల యిటువంటివన్నీ నమ్మనిస్థితికి చేరుకుంది.

రాజు ఫోన్ నెంబర్ యివ్వగానే వెంటనే సెల్ నుండి చేసింది. "హలో మార్గరెట్ హియర్" అని వినిపించగానే విమల తన్ని తాను పరిచయం చేసుకుని, తనిప్పుడు వాళ్ళఫ్లాట్ వద్ద వున్నానని, తనకి ఇల్లునచ్చిందని, ఎక్కడ కలవాలో చెప్తే, తాను వస్తానని లేకపోతే ప్రస్తుతం తనుంటున్న యింటికి వస్తానన్నా ఓకే అని చెప్పింది. మార్గరెట్ సంతోషంగా తన బ్రదర్ ని తీసుకుని విమలని ఒక గంటలో కలుస్తానని, అడ్రస్ తీసుకుంది. అమ్మలక్కలు వింతగాచూసి వెళ్ళిపోయేరు. విమల యింటికి వెళ్ళి, అక్కా బావలకు తనకి ప్రక్క వీధిలోనే ఫ్లాట్ కుదిరిందని, అగ్రిమెంట్ వ్రాసుకుందుకు వాళ్ళు వస్తున్నారని చెప్పింది. క్రిస్టియన్స్ యిల్లు అనేసరికి కమలకే కాక జ్యోతికి కూడా నచ్చలేదు. కాని విమల వాళ్ళు చెప్పినా వినేరకం కాదని వూరుకున్నారు.

అన్నప్రకారం మార్గరెట్ తన తమ్ముడితో సహా వచ్చింది. విమలకు తనభర్త బిజినెస్ లో నష్టం వచ్చి, హఠాత్తుగా గుండె పోటుతో పోయేడని, తను ఒక్కత్తే ఆ యింట్లో వుండలేక కొడుకుతో వేరే ఇంటికి వెళ్లిపోయేనని, తన ఫ్లాట్ లో దెయ్యాలున్నట్లు మిగతా వాళ్ళంటున్నారని దాచకుండా చెప్పింది. విమల దేముడ్నితప్ప యిలాంటివేమీ తను నమ్మనని చెప్పింది. నెలకు 5000రు.లు అద్దె, 10 నెలల అద్దె అడ్వాన్స్ యివ్వాలని, 10 నెలల తర్వాత 5% అద్దె పెంచి మళ్ళీ రెన్యూ చేసుకోవాలని చెప్పి, నచ్చితే సాయంత్రం స్టాంప్డ్ అగ్రిమెంట్ పేపర్స్ తో వస్తానంది. విమల సంతోషంగా అన్నిటికీ వొప్పుకున్నది. వచ్చేవారం ఫ్లాట్ లోకి మారతానని, యిల్లు శుభ్రం చేయించమన్న విమలతో, 'ఓహ్ ష్యూర్,నేను మీరొచ్చే లోగా పెయింటింగ్ చేయిస్తాను'.అన్నది. ఆ సాయంత్రమే అగ్రిమెంట్ సంతకాలు పూర్తయ్యాయి. 'డూప్లికేట్ కీ సొసైటీ వద్ద తీసుకోమని విమలకు తన తాళంయిచ్చి వెళ్ళి పోయింది. తర్వాత 3, 4 రోజులలో విమల వెళ్ళి, సోఫాసెట్, డైనింగ్ టేబుల్, టి.వి., కంప్యూటర్ వగైరా సామానంతకి అడ్వాన్సులిచ్చి, 1వ తేదీ సాయంత్రం ఫ్లాట్ లో డెలివర్ చేసేలా నిర్ణయించింది.

మొదటితేదీని ఫ్లాట్ కి వచ్చి పాలు పొంగించి, వున్నవి సర్దుకునేలోగా ఒక్కొక్కటిగా సామానంతా డెలివర్ చేసేరు. ఆ రోజు మాత్రం అక్క ఇంట్లో భోజనం చేసి, వచ్చి తన ఫ్లాట్ లో పడుకుంది. విమల దెయ్యాల మధ్య ఎలా వుందో అని పొద్దున్నే ఫోన్ చేసిన అక్కకు హాయిగా నిద్రపోయేనని, లేనిపోని బెంగపడొద్దని చెప్పింది విమల . పొద్దున్నే పాలపాకెట్స్ తో రాజు వచ్చేడు. అప్పటికే స్నానంచేసి తలుపుతీసిన విమలను కుశలమడిగి, పాలు యిచ్చి వెళ్లిపోయేరు. మరోగంటకి కూరలబండి వస్తే, రాజు వచ్చి పిలిచేడు. కావలసిన కూరలన్నీ తీసుకుని, రాజు భార్య, పిల్లల్ని పలకరించి, లిఫ్ట్ లో మీదకు వెళ్లిపోయింది. వంటయేక, రాజుని పిలిచి సామానంతా సర్దుకుంది. అతను వెళ్ళేటప్పుడు 20 రూ.లు ఇచ్చి పిల్లలకి బిస్కెట్స్ కొనిమ్మంది. అతను సంతోషించి, ఎప్పుడు ఎలాంటి అవసరమయినా, ఎంత రాత్రయినా తన్ని కానీ, భార్య నీలని కాని విమల తన హాలులో కిటికీ వద్దనుండి పిలుస్తే క్షణంలో వస్తామని చెప్పివెళ్లిపోయేడు.

సాయంత్రం మొదటిరోజు దెయ్యాలగురించి చెప్పినవాళ్లలో శేషమ్మ వచ్చేరు. 65-70 ఏళ్ల వయసుండొచ్చు. 3వ ఫ్లోర్ లో విమల క్రిందనున్న ఫ్లాట్ లో వుంటున్నామని, కొడుకు, కోడలు వుద్యోగాలకి, పిల్లలు హైస్కూల్ కి వెళ్లిపోతే ఒక్కదాన్నే వుంటానని, ఏం కావలసినా పిలవమని చెప్పింది. రెండురోజులలో శ్రావణశుక్రవారం వచ్చింది. పూజయేక విమల పళ్లెంలో పళ్ళు, తాంబూలాలు తీసుకుని ఒక్కొక్క ఫ్లాట్ కి వెళ్ళి, తన్నితాను పరిచయంచేసుకుని మాట్లాడి, పళ్ళుయిచ్చి వచ్చింది. తనున్నది కాక మిగతా 11ఫ్లాట్స్ లో 9 ఫ్లాట్స్ లో కుటుంబాలున్నాయి. అంతా గౌరవంగా మాట్లాడేరు. వుదయమేలేచి ఎక్సర్సైజ్ అవుతుందని ఇల్లంతా వూడ్చి, తడిబట్టతో తుడిచి, స్నానం, పూజ, దైవసంకీర్తన, భోజనం, తర్వాత వీణ సాధన పేరుతో దైవసంకీర్తన, సాయంత్రం అక్క ఇంటికి వెళ్ళి గంట గడిపి, అటుపైపే వున్న కోవెలకి వెళ్ళి, బయటపనులు చూసుకుని సాయంత్రం 6గం. కి ఇల్లు చేరడం ఇదీ విమల దినచర్య. మార్గరెట్ కాజువల్ గా ఒకసారి వచ్చింది. విమల పోస్ట్ డేటెడ్ చెక్స్ రాబోయే 9 నెలలకు రాసిచ్చి, మార్గరెట్ కి వివరించింది విమల, "ప్రతినెల రెంట్ ఇవ్వటానికి మీఇంటికి రాలేను. అలాగే మిమ్మల్ని రమ్మనటం భావ్యం కాదు. కనుక రాబోయే 9 నెలలకి, ఏ నెలకా నెల 1వ తేదీని నేనిచ్చిన చెక్ ని బ్యాంక్ లో సబ్మిట్ చేస్తే చాలు. రెంట్ మీ అకౌంట్ లో జమ అవుతుంది. మీకు, నాకు హాయి." అన్న విమలకు కళ్ళనీళ్లతో మార్గరెట్ నమస్కరించి, "ఆంటీ, గత 3 ఏళ్ళుగా నేను వేరే యింటికి రెంట్ కడుతున్నాను, ఈ ఇంటిమీద ఆదాయం లేదు. మీ పుణ్యమా ని బెంగతీరింది" అని అన్నది. "నీవు, నీకొడుకుతో వచ్చి, యీఇంట్లో వారంవుంటే భయం పోతుంది. తిన్నదరగక పుట్టించే పుకార్లని నమ్మకు. బ్రతికున్న మనుషుల్ని చూసి భయపడాలి కానీ పోయినవాళ్ళకి కాదమ్మా" అని ఓదార్చింది విమల.

రోజులిట్టే గడిచిపోతున్నాయి. మెల్లిగా 5,6 కుటుంబాలు బాగా సన్నిహితమయ్యాయి. పెద్దవాళ్ళు మధ్యాహ్నం వేళ టి.వి.లో చూసిన రామాయణంలోనో, భారతంలోనో వాళ్ళకి కలిగిన సందేహాలు విమలని అడుగుతూ కాలక్షేపానికి వచ్చేవారు. విమలకి చిన్నప్పటి నుంచి పురాణాలంటే సరదా. అలాగే విమలవద్ద సంగీతం నేర్చుకుందుకు కొందరు వచ్చేవారు. వాళ్ళు ఫీజ్ ఇస్తామంటే, ఆ డబ్బుతో ఏమయినా మంచిపని చేయమని విమల వాళ్ళకే ఇచ్చేసేది. విమల ఫ్లాట్ లో చేరిన రెండు నెలల్లో అమెరికా నుండి కొడుకు మధు, కోడలు సుధ, రెండేళ్ళ చంటిబాబుని తీసుకుని వచ్చేరు. వాళ్ళున్న టైములో బంధువులందరిని కలవడం, ఊటీ, కొడైకనాల్ వంటి సైట్ సీయింగ్ లతో టైము క్షణాలమీద గడిచిపోయింది. మధు కుటుంబం అమెరికా తిరిగి వెళ్ళిపోయేరు.


మర్నాటినుండి తనే పిలిచి ఫ్లాట్స్ అమ్మాయిలకి సంగీతం చెప్తూ, కావలసినవాళ్ళకి కంప్యూటర్ నేర్పి, సహాయం చేస్తూ విమల బిజీ అయిపోయింది. ఆ ఫ్లాట్స్ లో వున్నవాళ్ళందరికి తనవల్ల వాళ్ళకే సహాయం కావలసినా తప్పక అడగమని విమల చెప్పడంతో, పిల్లలు తమకన్న ముందుగా వస్తే, తాళం ఇవ్వమనే ఉద్యోగాలు చేసే గృహిణులు, పని మీద బయటకు వెళ్తూ పాలు వస్తే తీసుకోమనే వారు, యిలా

మొత్తం అంతా విమల కుటుంబమయిపోయారు. అలాగే ప్రతి పండుగకి వాళ్ళంతా పిండివంటలు తెచ్చివ్వటం, విమల తాను చేసినవి తిరిగి ఆ ప్లేట్లతో నింపివ్వటం, ఈవిధంగా విమలకి తాను వొంటరిగా వున్నానన్న భావమే పోయింది.

ఒకనాడు మధ్యాహ్నం విమల 'పాడుతా తీయగా' టి.వి.లో చూస్తుంటే శేషమ్మగారు వచ్చింది. టి.వి. లో ప్రోగ్రాం అయిపోయి ఆఫ్ చేసింది విమల. కాసేపు పిచ్చాపాటీ మాట్లాడి,"మీరేమనుకోనంటే ఒకటడగొచ్చా మిమ్మల్ని" అని విమల జవాబిచ్చేలోపే శేషమ్మ మళ్ళీ "మీరు స్వచ్ఛమైన బ్రాహ్మలు, అన్నీ తెలిసినవారు, పూజవందే కాఫీ కూడా తాగరు. మరి మీ కోడలు బ్రాహ్మలేనంటారా? మీ అబ్బాయి ప్రేమించి చేసుకున్నాడా? మావాడు చేసుకోలేదూ? నోరుమూసుకుని వూరుకున్నా. పిల్లల్ని వదులుకోలేము కదా? వుండబట్టలేక అడిగినందుకు మరోలా అనుకోకండి"అని ఆగింది.

విమలకి వొళ్ళు మండినా, పైకి మామూలుగానే, "అవునండి మధు తానే వెతుక్కున్నాడు, పెళ్ళికిముందే సుధ బ్రాహ్మణ పిల్ల కాదని తెలుసు. పెళ్ళికి ముందు సుధ, నేను కలిసి రెండురోజులు గడిపేక నేనే మధుతో సుధని చేసుకుంటే వాళ్ళిద్దరూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' లా వుండి నాకే బెంగవుండదని చెప్పాను. వాళ్ళ పెళ్ళైన ఈ అయిదేళ్ళలో ఏనాడూ మా సుధ కులం మాకెవరికి గుర్తు రాలేదు. తాను కూడా మాస్టర్స్ చదివి ఇంజనీర్ గా చేసింది. కొడుకు పుట్టేక, యింట్లో గృహిణిగా, తల్లిగా తన బాధ్యత నిర్వహిస్తూ , ఆఫీస్ లో ఉద్యోగ బాధ్యత నిర్వర్తిస్తూ, దేనికీ న్యాయం చేయలేనని ఆలోచించి జాబ్ రిజైన్ చేసింది. తాను జాబ్ కి వెళ్ళినా నేను ఇంటిబాధ్యత నిర్వహిస్తాననే నమ్మకం తనకున్నా, పెద్దవయసులో నాకు విశ్రాంతినివ్వటానికి తన కెరీర్ గురించి ఆలోచించలేదు. గుణం, శుభ్రత, సభ్యత, సంస్కారం దేనికీ లోటులేదామెకు. పక్కా శాకాహారి, పనిమంతురాలు, కులంకన్న గుణంమిన్న అని భగవద్గీతలో కృష్ణుడే చెప్పేడు. బ్రాహ్మలంటే బ్రహ్మజ్ఞానం కలవారని, ప్రతిమనిషిలో పరబ్రహ్మ స్వరూపాన్ని చూసేవారని అర్థం. రామాయణంలో 6కాండలు ప్లస్ ఉత్తరకాండ, భారతంలో 18 పర్వాలని, భాగవతంలో 12 స్కంధాలని, మా కోడలు జెనరేషన్ బ్రాహ్మలలో 10% మందయినా చెప్పగలరా? ఇతరులవద్ద వెజిటేరియన్స్ అని డంబాలు కొడుతూ, ఏకాంతంలో నాన్ -వెజ్ తినేవారిని నాకెంతమందినో తెలుసు. కులంవల్ల కాని, ధనంతో కాని, హోదాతో కాని మనుషులు గొప్పవారు కాలేరు. మనిషిని మనిషిగా చేసేది వారిప్రవర్తన, సభ్యత, సంస్కారం, ఆలోచించే విధానం.

ఇంక నా దేముడు మీద భక్తి అంటారా? దేముళ్ల లో బ్రాహ్మణదేముడు లేడే? శ్రీరాముడు క్షత్రియుడు, శివుడు శ్మశానవాసి, పాములు మెళ్ళో వేసుకుని, పుర్రెతో భిక్షాటన చేస్తాడు. నాయిష్టదైవం శ్రీకృష్ణుడు క్షత్రియుల కడుపునపుట్టి, గొల్లల ఇంట్లో పెరిగిన వర్ణసంకరుడు. కాని హిందువుల


దయ్యాల్ని భయపెట్టిన పద్మనాభం

పూర్వం మన హాస్యనటులు సినిమాల్లోనే కాక నిజజీవితంలో కూడా హాస్యాన్ని పండించే వారు. దీనికి ఉదాహరణగా ఈ సంఘటనను చెప్పుకోవచ్చు. హీరో కమ్ కమెడియన్స్ చలం, పద్మనాభంలు ఒక చిత్రం షూటింగ్‌లో నటిస్తుండగా, షాట్ గ్యాప్‌లో పిచ్చాపాటీ మాట్లాడు కుంటూ ...పద్మనాభం "ఒరేయ్ చలం నాకు దయ్యాలంటే భయంలేదురా" అన్నారట. దానికి చలం "కొయ్ కొయ్ కోతలు భలేగా కోస్తున్నావే...దెయ్యాలు కనపడితే అప్పు డుంటుంది అబ్బాయ్‌గారి పని" అని అనగా, దానికి పద్మనాభం " ఈమధ్య అదీ జరిగిందిరా బాబూ" అన్నారట. చలం "అయితే దెయ్యాల్ని చూసి భయపడలేదా" అనడిగితే... "నా వెంట పడుతున్న వాటిని చూసి నా సినిమాకి ఓ పదివేలు ఫైనాన్స్ ఇవ్వు...అన్నాను..అంతే ఆ దెయ్యం కాస్తా పారిపోయింది" అన్నారట. అది విని చలం కూడా పద్మనాభంతో కలిసి హాయిగా నవ్వారట.

మతగ్రంధమైన భగవద్గీత బోధించి అర్జునునికే కాక సర్వ జగానికి కర్తవ్యబోధ చేసిన మహనీయుడు. బ్రహ్మదేముడు బ్రాహ్మణుడయినా తప్పు సాక్ష్యం చెప్పిన నేరానికి ఆయనకు లోకంలో కోవెలకాని, పూజార్హత కాని లేదు. రాయబారానికి వచ్చినప్పుడు కృష్ణుడు సాటిరాజులెందరు ఆహ్వానించినా, శూద్రుడయినా మహామనీషి అయిన విదురుడింట్లో భోజనం చేసేడు. వారణాశిలో కాలకౌశికముని తన తపోబలంతో మదమెక్కి తనమీద రెట్ట వేసిన కాకిని భస్మం చేసి గర్విస్తాడు. కాశీఅన్నపూర్ణాదేవి ఆయనకు భిక్షవేసి, జ్ఞానోపదేశం పొందటానికి కసాయి కులంలోపుట్టిన ధర్మవ్యాధుడి వద్దకు పంపుతుంది. దేవిమాట కాదనలేక అమితగర్వంతో వెళ్ళిన ముని ధర్మవ్యాధుడి ఆచరణ చూసి సత్యాన్ని గ్రహిస్తాడు. కనుక మనుషులలో రెండే కులాలు-మంచివారు, చెడ్డవారు. మీ భవానిని యిన్నాళ్లుగా చూస్తున్నాను. తాను బుద్ధిమంతురాలు. ఒక్కొక్కసారి మనకి తెలియకుండానే కులగర్వం మనని ఆవహిస్తుంది.

**మోక్షం పొందేందుకు పూజలు, జపాలు, స్తోత్ర పారాయణలు అవసరమా?** అది పొరపాటు. ఇవన్నీ భక్తి యొక్క అంగాలు. పాలను పోసే ముందు పాత్రను ఎలా శుద్ధి చేస్తామో అలానే పరమపవిత్రమైన జ్ఞానాన్ని పొందాలనుకునే సాధకుడి హృదయ క్షేత్రము కూడా శుద్ధి పొందాలి. అందుకే **'మోక్షసాధన సామగ్ర్యాం భక్తి రేవగరీయసీ'** మోక్షసాధనకు అంతఃకరణ శుద్ధి అవసరము. అట్టి అంతఃకరణ శుద్ధికి భక్తి అనే మార్గాన్ని సూచించారు. కాబట్టి భక్తుడు కానిదే జ్ఞాని కాలేడు. జ్ఞానార్జనకు భక్తి మొదటి మెట్టు. ఈ మెట్టునే ఎక్కలేని వాడు మోక్షపదానికి అర్హుడు కాలేడు. కాబట్టి సాధకుడు పూజ, జపము, స్తోత్రపారాయణల వంటి సత్కర్మలను ఆచరించి **భక్తి** అనే సోపానంతో అంతఃకరణ శుద్ధిని పొందగలడు.

మీ తోబుట్టువు వంటిదాన్ని. మిమ్మల్ని నొప్పిస్తే నన్ను క్షమించండి" అని చేతులుజోడించింది విమల. "విమలమ్మా, నా తప్పుని వివరించి తెలియచెప్పేవు" అని సెలవు తీసుకుంది.

'రంజాన్'పండగనాడు క్రిందఫ్లాట్ లో వున్న ముస్లింయువతి, షబానా కనపడగానే 'రంజాన్ ముబారక్' అని విష్ చేసిన విమలను లోపలికి రమ్మని పిలిచింది. కూర్చోమని సోఫా చూపి, ఏలకులు వేసిన టీ




తెచ్చి, "ఎక్కడికి వెళ్తున్నారు ఆంటీ?" అని అడిగింది. "రోజూలాగే కోవెలకి వెళ్తున్నానమ్మా" అంది విమల. "ఇవాళ మాపండగ ప్రసాదంయిస్తే తప్పులేదా మీకు" అంది. "షబానా, మీదేముడు, నాదేముడు వేర్వేరా? అలా ఆలోచిస్తే దేముడ్ని మనం కించపరిచినట్లు, కులమతాలతో ఆయనకు పక్షపాతం అంటకట్టినట్లు అవుతుందమ్మా, తీసుకురా" అంది విమల చిరునవ్వుతో. షబానా యిచ్చిన ప్రసాదం భక్తిగా కళ్ళ కద్దుకుని నోట్లోవేసుకుంది విమల. ఫ్రూట్ కస్టర్డ్ లా కోవారుచితో రకరకాల ఫ్రూట్స్, ఏలకుల పరిమళంతో చాలా బాగుంది. "మంచి ప్రసాదం, ఎలా చేసేవో చెప్తే నేను మా దేముడుకి కొత్తరుచి చూపిస్తానన్న" విమలని ఆశ్చర్యంగా చూసింది వీధిలో నుంచున్న ప్రక్క ఫ్లాట్ శారదమ్మ.

మర్నాడు మధ్యాహ్నం "విమలమ్మా, భోజనం అయిందా" అంటూ విమల ఇంటికి వచ్చింది మరో ఫ్లాట్ లో వుండే శారదమ్మ. "రండి, పిన్నిగారూ, ఇవాళ శనివారం ఉపవాసం. రవ్వ ప్రసాదం, పండు, పానకం నైవేద్యం పెడతాను. పండు రాత్రికి వుంచి, ప్రసాదం, పానకంతో నా పొట్ట పూజచేసేను" అంటూ నవ్వుతూ చెప్పి, సోఫాలో కూర్చోపెట్టి, తనూ కూర్చుంది విమల. "విమలమ్మా, తల పగల కొట్టుకున్నా నీ సంగతి అర్థం కావట్లేదు. నిన్న ఆ తురకల కొంపలో దూరి, దాని చేతి టీ, తురకప్రసాదం తిని మెచ్చుకోవడమేమిటి? ఇంట్లో చూస్తే ఈ పూజలు, ఉపవాసాలు, ప్రసాదాలేమిటి? నాకు ఒళ్ళంతా కారం రాసుకున్నట్లుందమ్మా. మీ పుట్టిల్లు, అత్తిల్లు రెండు శుద్ధ వైదీక వెలనాటి బ్రాహ్మణకుటుంబాలే. అసలు మొదలే నీవీ కిరస్తానీ దెయ్యాలకొంపలో దిగినప్పుడే నాకు ఇష్టం లేదనుకో." అని ఆగింది నిట్టూర్పుస్తూ. విమలకి శారదమ్మ దూరపుబంధువు.

నిశితంగా శారదమ్మవంక చూస్తూ, "పిన్నీ, మన వీధిచివర కోవెలకు మనం తిన్నగా వెళ్తున్నప్పుడు, మనముందు వీధివాళ్లు మలుపు ఎందుకు తిరగాలి? ఇంకా దూరంవాళ్ళు చాలావీధులు, చాలా మలుపులు తిరిగివస్తారు. మనమంతా బయల్దేరినది ఒకే కోవెలలో, ఒకే దేముడ్ని చూడ్డానికికదా? మరి దారులెందుకు వేరవుతున్నాయి? పరమాత్ముడు ఒకడే అయినప్పుడు, రాముడు, కృష్ణుడు, వెంకటేశ్వరుడు, శివుడు, విష్ణువు యింతమంది దేముళ్ళుగా, యెప్పుడు, ఎలా చీలిపోయేరు? ఒకే పూజామందిరంలో, ఒకే కోవెలలో రకరకాల పేర్లతో అన్ని దేముళ్ళేమిటి? మనకన్న వాళ్ళు నయం. క్రిష్టియన్స్ కి క్రీస్తు, ముస్లింస్ అల్లా మాత్రమే. మరి వాళ్ళు నిన్ను నిలదీస్తే ఏమని జవాబు చెప్తావు? మనకన్ని దేముళ్ళున్నా అవన్నీ ఒకే ఒక పరబ్రహ్మస్వరూపం. ఎవరికి నచ్చిన రూపాన్ని వారు ఆరాధిస్తారు. అందరం చేరే గమ్యం వొకటే. మరిందులో ఎక్కువ తక్కువలెందుకు? మన దేముళ్ళ సహస్రనామాలలాగే అల్లా, క్రీస్తు ఇవన్నీ దేమునివే వేర్వేరు రూపాలు, నామాలు. ఎవరికి నచ్చిన రూపాన్ని వారు ఆరాధిస్తాం కాని అందరూ ఆయన పిల్లలే కదా. తెలివైనవారయినా, బడుద్దాయిలైనా, ధనవంతులైనా, పేదలయినా పిల్లలమీద తల్లి తండ్రి ప్రేమ సమమే. పెంకిపిల్లల్ని దిద్దటానికి తల్లిదండ్రులు ప్రయత్నిస్తారే తప్ప వాళ్ళని దూరంచేసుకోరు. నీవు, నీ పిల్లలు నాయింటికి వస్తే నావద్ద వున్నది నీ పిల్లలకిచ్చి, నీకు నీళ్ళిచ్చినా సంతోషిస్తావు కాని నీకు పిండివంటలతో భోజనంపెట్టి, నీ పిల్లల్ని పస్తుంచితే నీకు కోపం రాదా పిన్నీ. రాగద్వేషాలతో నిండిన మనమే యిలా ఆలోచిస్తే, పరమాత్ముడు ఆయన పిల్లల్ని అంటే మన సాటిప్రాణుల్ని నిరసిస్తే, మనల్ని మన్నిస్తాడా? అందుకే పెద్దలు వసుధైకకుటుంబం అన్నారు పిన్నీ, అందరం ఒకే కుటుంబం" అని లేచింది విమల.

అంతా విని సాలోచనగా తల వూపుతూ, చిన్నదానివయినా నా బుర్ర బూజు దులిపేవే తల్లీ, ఇంతవరకు ఇలా బోధపరిచినవారు దొరకలేదమ్మా. వస్తా" అంటూ నిష్క్రమించింది శారదమ్మ ప్రసన్నంగా.



నేను 1997లో, నా 54వ ఏట మా అబ్బాయిలవద్దకు అమెరికా వచ్చి, యిక్కడ స్థిరపడ్డాను. మ్యూజిక్, పుస్తకాలు చదవటం నా హాబీలు. ఇటీవల 'బ్లాగు' లో వ్రాయటం మొదలుపెట్టేను. దేముడిమీద విశ్వాసం, ఆయనేది అనుగ్రహిస్తే, దానికి మనస్ఫూర్తిగా తలవంచి, నా పంథాలో నేను జీవించటం నా ప్రయత్నం.

# బాల వినోదిని

మోహన్ కృష్ణ మరియు మోనీష్ కృష్ణ. (పిల్లల సేకరణ)

## అనువుగాని చోట.... (నీతి కథ)




ఒకసారి దుర్యోధనుడు తన తమ్ముళ్లయిన దుశ్శాసనుడు, దుస్సహుడు, దుర్విగాముడు దర్పదుడుతో హిడింబి వనానికి విహారార్థం వెళ్ళాడు. రాక రాక ఇన్నాళ్ళకు మరుదులు తనింటికి వచ్చినందుకు హిడింబి సంతోషించి విందు భోజనానికి ఏర్పాట్లు చేసింది. విందుకు ముందు దుర్యోధనుడు హిడింబితో తన పరాక్రమం గురించి, తన తమ్ముళ్ళ పరాక్రమం గురించి చాలా సేపు చెప్పాడు. భీముడు మరియు పాండవులంతా తమ కాళి గోటికి సరిపోరని చెప్పుకున్నాడు. హిడింబి అంతా ఓపికగా ఉంది.

చివరికి మరుదులు నలుగురికి విందు వడ్డించింది హిడింబి. అందులో తలా కొన్ని నువ్వులు కూడా అందరికీ పెట్టింది. అందరూ అన్నీ కలుపుకొని "నెయ్యి ఏది?" అన్నారు. మేము నెయ్యి వాడం, నువ్వుల నూనె వాడుతాము అని చెప్పింది. నువ్వులను చూపించి దుర్యోధనున్ని పిండుకోమని చెప్పింది. దుర్యోధనుడు తన కుడి చేత్తో నువ్వులు పట్టుకొని గట్టిగా పిండాడు. కానీ నూనె రాలేదు. దుర్యోధనుడు ఎంతో ప్రయత్నించినా చుక్క నూనె కూడా రాలేదు. అన్నా తమ్ములందరు ఎంత ప్రయత్నించినా ఫలితం శూన్యం. హిడింబి నవ్వుకొని తన చేత్తో దుర్యోధనుడి పిడికిలి ఒడిసి పట్టి గట్టిగా పిండింది. నువ్వుల నూనె తో సహా అర చెయ్యి చితికి రక్తం కూడా కారి అన్నంలో పడింది.

ఆశ్చర్యంగా చూస్తున్న వారిని చూస్తూ హిడింబి ఇలా అన్నది—" చూసారా మరిది గారు! మీ పరాక్రమం నువ్వుల నూనె తియ్యటానికి కూడా పనికి రాలేదు. మరీ నా బలం చూశావ్ కదా! భీముని భార్యను నేను. ఇక భీముని బలం గురించి నేను నీకు వేరే చెప్పాలా? భీముని ముందు మీరెంత? భీముడు ఎప్పుడు ఇక్కడికొచ్చిన నువ్వుల నూనె పిండుకొనే భోజనం చేస్తాడు. నా దగ్గర చెపితే చెప్పావు కానీ మీ సోదరుల దగ్గర ప్రతాపం చూపించకు! ఆయన అసలే కోపిష్టి. ఇక విందుని ఆరగించండి" అని దుర్యోధనుడి పళ్ళెం మార్చి వారికి నెయ్యి అందించింది. దుర్యోధనుడు అనువు గాని చోట అధికులమనరాదని తెలుసుకొన్నాడు.

### సామెత (సాయి కృష్ణ వీరవెల్లి)

**పైత్య రోగికి పంచదార చేదు.**

పంచదార తియ్యగా ఉంటుంది, కానీ పైత్యం ఉన్న వాడికి అది చేదు గానే ఉంటుంది. ఆ చేదు పైత్య ప్రభావం వల్ల వచ్చిందే! అదే విధముగా కొంత మందికి మంచి కూడా చెడ్డగా అనిపిస్తుంది. అది వారి ఆలోచన లో ఉన్న లోపమే కానీ అవతల వారి లోపం ఎంత మాత్రం కాదు.

### ఈ ప్రపంచంలో (మనస్వి ప్రతికంటమ్)

| అతి సులువైనవి | అతి కష్టమైనవి |
| --- | --- |
| స్నేహం చెయ్యటం | స్నేహం నిలబెట్టుకోవటం |
| ప్రేమించటం | ప్రేమించబడటం |
| మోసం చెయ్యటం | నమ్మకం పుట్టించటం |
| అబద్దాలు చెప్పటం | నిజం భరించటం |
| ఏడిపించటం | నవ్వించగలగటం |

## INDIAN CUISINE

BELLEVUE 425-641-4442
BOTHELL 425-481-6900

## FOODS

REDMOND 425-861-3800
BOTHELL 425-483-3000
ISSAQUAH 425-313-1983

## VIDEO

REDMOND 425-881-6925

## BAKERY

REDMOND 425-881-6284

## CHAT & SWEETS

REDMOND 425-881-6284

# mayuri FAMILY OF BUSINESSES

THANK YOU FOR YOUR CONTINUOUS PATRONAGE TO OUR FAMILY OF BUSINESSES

**MAYURI FAMILY OF BUSINESSES**
**www.mayuriseattle.com**
**1.800.874.5593**


mayuri
షడ్రుచులలోని తీపి నవరసాలోని సంతోషం మీ సొంతం కావాలని
కోరుకుంటూ మీకు మరియు మీ కుంటుంబ సభ్యులందరికీ
మయూరి నుండి శ్రీ జయ నామ సంవత్సర ఉగాది శుబాకాంక్షలు .
రుచికి సుచికి మరియు ఆత్మీయతకు ఎల్లప్పుడు మీ మయూరి కే
MAYURI FOODS | REDMOND
2560 152ND AVENUE NE
REDMOND, WA 98052
425.861.3800
MAYURI FOODS | BOTHELL
20611 BOTHELL-EVERETT HWY
BOTHELL, WA 98012
425.481.6900
MAYURI FOODS | ISSAQUAH
710 NW GILMAN BLVD
ISSAQUAH, WA 98027
425.313.1983
MAYURI INDIAN CUISINE | BELLEVUE
15400 NE 20TH STREET
BELLEVUE WA 98007
425.641.4442
MAYURI INDIAN CUISINE | BOTHELL
20611 BOTHELL-EVERETT HWY
BOTHELL, WA 98012
425.481.6900
MAYURI BAKERY, SWEETS & CHAT
2560 152ND AVENUE NE
REDMOND, WA 98052
425.81.6284
MAYURI VIDEOS
2560 152ND AVENUE NE
REDMOND, WA 98052
425.881.6925
WWW.MAYURISEATTLE.COM | WWW.MAYURIFAMILY.COM | WWW.MAYURIBAKERY.COM

# 'మాయ'- నారద మహర్షి కథ

శ్రీనివాస్ మరియు లావణ్య బందారపు (bandarapu@gmail.com)

మన అందరకీ నారదుడు లోక సంచారి గాను, కలహ ప్రియుడి గాను



సుపరిచితుడే. లోక కళ్యాణమే పరమార్థంగా నారదుల వారు ఎక్కని గడప లేదు, పెట్టని తగవు లేదు. ఆయనకు కూడా కర్మ ప్రభావమున కలిగిన కొన్ని అనుభవాలు పురాణములలో చెప్పబడి ఉన్నవి. బ్రహ్మ మానస పుత్రుడని కూడా నారదుల వారికి పేరు ఉన్నదని మనందరకీ తెల్సిన విషయమే!

ఒక సందర్భమున బ్రహ్మ భగవానుడు తన కుమారుడిని సంసారిగా, మోక్షగామిగా అవ్వమని అడుగగా, మాయా ప్రభావితుడయిన నారదుడు నారాయణుని సేవను మించిన స్వర్గమేమిటని, సంసారమన్న విషపుటాలోచన ఎందుకని తండ్రిని నిలదీసెను. పుత్రుడి సమాధానమునకు కోపోద్రిక్తుడైన బ్రహ్మ, తండ్రితో మాటలాడు తీరు ఇది కాదని మందలించి నారదుడి సోదరులయిన శనక, సనందన, సనాతన మరియు సనత్ కుమారులే విధముగా మర్యాదాపూర్వకముగా తన గృహస్థు కోరికను తిరస్కరించిరో తెలిపి, తండ్రినే ఛీత్కరించిన నారదుడిని ఒక మహర్షి వలె మారి సంగీత విభావరి చేయుచూ ముల్లోకములు చుట్టమని, దాసి కుమారుడిగా జన్మించి, పాప పరిహారము గావించుకొని తనను బ్రహ్మలోకము నందు మహాజ్ఞానిగా కలుసుకొనమని శపించెను. తండ్రి శాపమునకు ప్రతిగా ముల్లోకములందు బ్రహ్మను మూడు కల్పముల పాటు పూజించరాదని శపించి, శాంతించిన పిమ్మట తండ్రిని ప్రసన్నం చేసుకొని తనకు ముందు జన్మలు జ్ఞాపకముండే విధముగా మరియు నారాయణుని నామము ఉఛ్వాస నిశ్వాసాలుగా వరము పొందెను.

శాప వశమున నారదుడు ఉపబర్హనుడనె గంధర్వ రాజుగా జన్మించెను. అతనికి 60 మంది గంధర్వ కాంతలు భార్యలుగా నుండిరి. మాళావతి అను పతివ్రతా శిరోమణి పట్టపు రాణిగా ఉండెడిది. ఒకానొక సందర్భమున దేవలోక నర్తకి అయిన రంభను చూసి మనసు పడి చంచలుడైన కారణమున, బ్రహ్మశాప వశమున యోగ మార్గమున (మూలాధార, స్వధిస్తన, మణిపుర, అనహత, విషుద్ధ మరియు ఆజ్ఞ చక్రంలను ఛేదించి, ఇడా, సుషుంన, మేధా, పింగళ, ప్రాణహారిణి, సర్వ జ్ఞనప్రద, మానః సంయమని, విషుద్ధ, నిరుద్ధ, వాయసంచారీని, జ్ఞాన జరుంభరణ కారిణి, సర్వ ప్రాణహర మరియు పునర్జీవనకారిణి నదులను దాటి) మరణించెను. తన భర్త మరణ వార్త విన్న మాళావతి ఆగ్రహోదుగ్రురాలై హోమాగ్నిలో తనను తాను అర్పించ తలపెట్టెను. శ్రీ మహా విష్ణువు ఆ మహా ఇల్లాలి కోపము అంత మంచిది కాదని తలచి తన పతిని బ్రతికించి ఇచ్చెను.

నారదుడి జీవితములో ఇలాంటి ఘటనలు కోకొల్లలు. దక్ష ప్రజాపతి శాప వశమున ఒక సారి భూలోకమునకు పయనమయిన నారద మహర్షి, పర్వత దేవర్షులిరువురికి సంజయ మహారాజు ఆతిథ్య మొసంగెను. సంజయ మహారాజు పుత్రిక దమయంతి దేవి స్వయముగా ఈ మహా మునుల అతిధి మర్యాదలు చూసుకొనుచుండెను. సంగీతము నందుండే ఇష్టము వలన నారద, దమయంతులిరువురు ఒకరినొకరు ఇష్ట పడిరి. ఇది గమనించిన పర్వతుడు కోపగించి కోతి ముఖమును శపించి రాజ్యమును వీడెను. దమయంతి గుర్రమును పోలిన కిన్నెరల వలె నారదుడు కూడా సంగీత నిష్ణాతుడని తండ్రిని ఒప్పించి వివాహము గావించుకొని సంతోషంగా నుండిరి. పిమ్మట కొద్ది కాలమునకు పర్వత మహర్షి నారదుడిని కలిసి వారి సంతోషార్థము శాపమును వెనుకకి తీసుకొనెను.

కర్మ ఫలం గురించి నారదుడికే మరొక అనుభవము కూడా ఉన్నది. ఒకనాడు శ్రీ కృష్ణ సమేతుడయి నారద మహర్షి విహారానికి బయలు

దేరెను. సందర్భోచితముగా మాట్లాడుతూ కర్మ ఫలము నంతటిని అనుభవించి ఉన్నానని నారదుడు నవ్వుతూ చెప్పగా ఆ నల్లని వాడు తనలో తనే నవ్వుతూ - ఏ విధముగా నీ రాకను, నీ చేతలలోని మర్మమును మేము గుర్తింపజాలమో, అదే విధముగా కర్మ ఫలమును, దాని మహా మాయను నీవే కాదు మరెవ్వరూ అర్థం చేసుకొనజాలరు అని చెప్పి గరుడుని పైకెక్కి బయలుదేరెను. మార్గ మధ్యమున ఒక సరస్సులో స్నానమాచరించ అందులో నారదుడు వివస్త్రుడై మునుగగా,




ఆ మహా విష్ణువు నారదుడి బట్టలు, కమండలము మరియు మిగతా వస్తువులతో అంతర్ధానమయ్యెను. నీట మునిగిన నారదుడు అతి లోక సౌందర్య రాశి వలె మారి పైకి వచ్చెను. అంతయె కాక అతని పూర్వ జ్ఞాపకములన్నియు మరచి పోయెను. అంతలో అటుగా వచ్చిన మహారాజు ఆమెను చూచి ఇష్టపడి తాను ఎవరో చెప్పలేక పోవటం తో సౌభాగ్య సుందరి అని నామకరణం చేసి తన పట్టపు రాణి గా చేసుకొనెను. వారిరువురికి కాలక్రమమున పన్నెండుగురు సంతానం కలిగెను. ఒక యుద్ధములో అందరు కుమారులనూ కోల్పోయిన సౌభాగ్య సుందరి అదే సరస్సున పతి సమేతమున చేరి మునుగగా మళ్లీ మునుపటి వలె నారదుడాయెను. **అంతటి శక్తివంతమయిన కర్మ ఫలముననుభవింపక ఆ నారదుడికే తప్పలేదు, ఇక మానవమాత్రులమైన మనకు ఆ మహా మాయ పాశములు నేర్పించటం సర్వ సాధారణము. ఇది గ్రహించి పాఠకులెల్ల కర్మ ఫలమును తప్పించుకొనుట బదులు భగవంతుని సహాయము తీసుకొని ఆ మహా మాయను అధిగమించవలెనను నీతి నారదుడి రూపేణా ఇక్కడ చెప్పబడినది.**




Ω






# రాశి ఫలాలు (జయ నామ సంవత్సరం)

(ఉదయ భాస్కర దీక్షితులు)

ఆదాయం 14 వ్యయం 2 రాజ పూజ్యం 4 అవమానం 5



మేష

ఈ సంవత్సరం గత సంవత్సరం కంటే ఆదాయం బాగుంటుంది.వ్యవహారముల యందు జాప్యం వలన కొంత మానసిక ఆందోళన.వృత్తి వ్యాపారముల యందు నమ్మక ద్రోహం కాకుండా జాగ్రత్త పడటం చాలా అవసరం. నవంబరు నెల నుండి శని అష్టమ సంచారం వలన కాస్త ఆరోగ్య భంగం వాటిల్లే అవకాశం ఉంది.ఉద్యోగులు పై అధికారులతో అప్రమత్తతతో ఉండటం మేలు.విద్యార్థులు శ్రద్ధ చూపని యెడల ఫలితం ఆశించినంతగా ఉండదు.అవివాహితులకు అనువయిన కాలం.శని,రాహు,కేతు స్తోత్రం మంచిది.

ఆదాయం 8 వ్యయం 11 రాజ పూజ్యం 7 అవమానం 5

ఈ సంవత్సరం మిశ్రమ ఫలితాలు ఉంటాయి.ఋణావసరం రావొచ్చు.అధికారుల మన్ననలు పొందుతారు.జాయింటు వ్యాపారాలలో జాగ్రత్త అవసరం.ఉద్యోగస్తులు పై అధికారులతో, యాజమాన్యంతో వినయంగాను, గౌరవంతోనూ వ్యవహరించడం వలన బాగుంటుంది. విద్యార్థులకు కొంత శ్రమిస్తే ఫలితం బాగుంటుంది.స్త్రీలు ఆరోగ్య విషయంలో అప్రమత్తత అవసరం. మానసిక,హృదయ,ఉదర సంబంధిత సమస్యలు రావొచ్చు.కావున ఆహార విహారాల యందు ముందు చూపు అవసరం. గురు,శని,రాహు, కేతు,దుర్గా స్తోత్రం, జపం ఉపశమనాన్నిస్తాయి.



వృషభ

ఆదాయం 11 వ్యయం 8 రాజ పూజ్యం 3 అవమానం 1




మిథున

ఈ రాశి వారికి జులై నుండి గురు బలం వల్ల ఆర్థికంగాను,ఆరోగ్యపరంగానూ బాగుంటుంది. గౌరవ మర్యాదలు బాగుంటాయి.రాజకీయంగా పలుకుబడిని సంపాదిస్తారు.వ్యాపార,పారిశ్రామిక రంగాల వారికి మంచి కాలము.ఉద్యోగులకు ప్రమోషన్లు,ఆశించిన బదిలీలు ఉంటాయి.అధికారుల ప్రశంసలు లభిస్తాయి.శ్రమకు మించిన ప్రతిఫలం.విద్యార్థులకు మంచి ఫలితాలు వస్తాయి.స్త్రీలకు వివాహయోగ్యమైన సమయం.

ఆదాయం 5 వ్యయం 8 రాజ పూజ్యం 6 అవమానం 1

ఈ రాశి వారికి ఆదాయానికి మించిన ఖర్చు. గౌరవ మర్యాదలు బాగానే ఉంటాయి.వృత్తి వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి.పని వత్తిడి వల్ల ఉద్యోగులకు మనశ్శాంతి లోపిస్తుంది.విద్యార్థులు జాగ్రత్తగా ఉండటం అవసరం.కోర్టు వ్యవహారాలందు ప్రతికూలత ఉండే అవకాశం.స్త్రీలు ఆరోగ్యం పట్ల,కుటుంబ సంబంధాల పట్ల జాగ్రత్తగా ఉండటం అవసరం.అవివాహితులకు ఆలస్యమైనా అనుకూల సమయం.



కర్కాటక

# రాశి ఫలాలు (జయ నామ సంవత్సరం)

(ఉదయ భాస్కర దీక్షితులు)

ఆదాయం 8 వ్యయం 2 రాజ పూజ్యం 2 అవమానం 4



ఈ సంవత్సరం ప్రగతి పథంలో ఉండి,ఆర్ధికంగా బాగుంటుంది.నూతన ప్రయత్నాలకు అనువైన కాలం.ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు,ఐటీ ఉద్యోగులకు ప్రమోషన్లు,విదేశీయానాలు ఉంటాయి.విద్యార్ధులు ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణత పొందే అవకాశం ఉంది.గృహ నిర్మాణంలోను,వివాహాది వ్యవహారాల్లోను కృతకృత్యులయే అవకాశం ఉంది.

సింహ

ఆదాయం 1 1 వ్యయం 8 రాజ పూజ్యం 5 అవమానం 4

వ్యాపార,పారిశ్రామిక రంగాలవారికి పెట్టుబడికి తగ్గ రాబడి ఉంటుంది.నూతన వ్యవహారములకు శుభ సమయం.నవంబరు నుండి ఏలినాటి శని తొలుగుతుంది.గౌరవ మర్యాదలు వృద్ధి చెందుతాయి.జన్మ రాశిలో రాహు సంచారం వల్ల కొంత ఆరోగ్య భంగం కలగవచ్చు. ప్రభుత్వ,ప్రైవేటు ఉద్యోగులకు అభివృద్ధి,స్థానచలనం.నిరుద్యోగులకు జులై నుండి ఆశాజనకంగా ఉంటుంది. విద్యార్ధులకు ఆశాజనకం.వివాహానికి అనుకూల సమయం.రాహు,కేతు,కుజ గ్రహ శాంతి,స్తోత్రం శుభకరం.



కన్యా

ఆదాయం 8 వ్యయం 1 1 రాజ పూజ్యం 1 అవమానం 7



ఏలినాటి శని వల్ల ఆర్ధికంగాను,రాజకీయంగాను కొంత ప్రతికూలత ఉంటుంది కావున అప్రమత్తత అవసరం. కుటుంబంలో స్పర్ధలు,మానసిక అశాంతి.మనసు విప్పి మాట్లాడుకోవటం చాల అవసరం. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో యజమానులకు ఉద్యోగుల వల్ల ఇబ్బందులు. రాజకీయ నాయకులకు ప్రజల్లో వ్యతిరేకత.ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు,ప్రమోషన్ల విషయంలో ఆలస్యం, విద్యార్ధులు శ్రమించటం అవసరం. ఏలినాటి శని మరియు ప్రతికూల రాహు గ్రహం వల్ల శని,రాహు జపం,శాంతి,స్తోత్రం మంచిది. సుందరకాండ పారాయణం మంచిది.

తుల

ఆదాయం 14 వ్యయం 2 రాజ పూజ్యం 4 అవమానం 7

ఈ రాశి వారికి జూన్ 19 తరువాత గురుబలం వల్ల ఏలినాటి శని ప్రభావం తక్కువగా ఉంటుంది. గత సంవత్సరం కంటే మేలుగా ఉంటుంది.ఆదాయం బాగుంటుంది.వ్యాపార,పారిశ్రామిక రంగాల్లో బాగుంటుంది.మానసిక ధైర్యం చేకూరుతుంది.ఉద్యోగులకు సర్వత్ర బాగుంటుంది.నిరుద్యోగులకు ఆశాజనకం.విద్యార్ధులు మంచి మార్కులు సంపాదిస్తారు.స్త్రీలకు యోగదాయకంగా ఉంటుంది.శుభకార్యాలకు అనుకూలమైన సమయం.శని,కుజ గ్రహ శాంతి లేదా స్తోత్రం మంచిది.



వృశ్చిక

# రాశి ఫలాలు (జయ నామ సంవత్సరం)

(ఉదయ భాస్కర దీక్షితులు)

ఆదాయం 2 వ్యయం 1 1 రాజ పూజ్యం 7 అవమానం 7



ధనుస్సు

వీరికి ఈ సంవత్సరం మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. సంవత్సరాది నుంచి అక్టోబరు వరకు బాగుంటుంది.కార్యసిద్ధి,ఆదాయం ఉంటాయి కాని,ఆదాయం కంటె ఖర్చు ఎక్కువగా ఉంటుంది.వృత్తి వ్యాపారముల యందు జాగరూకత చాలా అవసరం.ఉద్యోగులు పై అధికారుల నుంచి గుర్తింపు పొందటం కష్టంగా ఉంటుంది.విద్యార్థులకు శ్రమకు తగ్గ ఫలితం కనిపించదు.కావున బాగా కష్టపడటం అవసరం.వీరికి నవంబరు నుండి ఏలినాటి శని ప్రారంభం.శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం,ఆరాధన యోగదాయకం.

ఆదాయం 5 వ్యయం 5 రాజ పూజ్యం 3 అవమానం 3

వీరికి గ్రహస్థితి అనుకూలంగా ఉండటం వల్ల తలచిన మరియు ప్రారంభించిన పనులు నెరవేరతాయి. రాబడికి తగ్గ ఖర్చు ఉంటుంది. బంధు మిత్రులతో సాన్నిహిత్యం పెరుగుతుంది. కుటుంబ సాన్నిహిత్యం పెరుగుతుంది. ప్రతి రంగం లోను విజయం చేకూరుతుంది. నూతన గృహములు మరియు వాహనములు కొనుగోలు చేస్తారు. అవివాహితులకు వివాహ యోగ్యకాలం. స్థిరాస్థులను పెంచుతారు.విద్యార్థులకు అనుకూల కాలం.



మకర

ఆదాయం 5 వ్యయం 5 రాజ పూజ్యం 6 అవమానం 3



కుంభ

ఈ రాశి వారికి గ్రహ స్థితి ప్రతికూలంగా ఉండటం వలన ప్రతి పని యందు కాలయాపన సంభవిస్తుంది.స్వల్ప లాభాలు.ఋణం చేయవలసి రావొచ్చు.సంఘంలో పరపతి బాగానే ఉంటుంది.ఉద్యోగస్థులకు అనుకూలత తక్కువ.విద్యార్థులు ఉత్తీర్ణతకు ఆధిక శ్రమ పడవలసి ఉంటుంది.స్త్రీలకు జూన్ తర్వాత ఊహించని ఇబ్బందులు ఎదుర్కొనవలసిరావచ్చు.ఈ రాశి వారికి గ్రహస్థితి ప్రతికూలంగా ఉండటం వలన గురు,కుజ,శని,రాహు,కేతు జప దాన హోమాలు ఉపశమనం కలిగిస్తాయి.

ఆదాయం 2 వ్యయం 1 1 రాజ పూజ్యం 2 అవమానం 6

వీరికి ఈ ఏడాది అన్ని రంగాల్లోనూ అనేక ప్రతిబంధకాలు ఉంటాయి.గురుబలం జులై నుంచి ఉన్నప్పటికీ, రాహు,కేతు,శని గ్రహముల ప్రతికూలత బాగా ఉంటుంది. ఆర్థికంగా ఇబ్బందిగా ఉంటుంది. కుటుంబంలో స్పర్థలు రాకుండా చూసుకోవడం మంచిది. ఉద్యోగులకు ఆర్థిక ఇబ్బందులు మనస్సు నిలకడ లేకుండా చేస్తాయి.స్త్రీలకు ఆరోగ్యం విషయం లో అప్రమత్తత అవసరం.అవివాహితులకు గురుబలం వలన వివాహం జరుగును.నిరుద్యోగులకు ఉద్యోగ ప్రాప్తి.కుజ,శని,రాహు కేతు జపం,విష్ణు సహస్రనామ పారాయణం శుభం కలిగిస్తాయి.



మీన

# కవితా వల్లరి

ఉగాది కొత్త కవులకు, కోకిల కుహు కుహులకు ఆరంభ కాలం. కవి సమ్మేళనాలు తెలుగు సాహితి ప్రోత్సాహికులకు మంచి వేదికలు .

## ఉగాది

వచ్చింది వచ్చింది ఉగాది
భిన్న రుచుల సమ్మేళనం ఉగాది
కవుల కవితల సమ్మేళనం ఉగాది
పంచాంగం ఫలితాల సమ్మేళనం ఉగాది
మావిచిగురు మధుమాసం సమ్మేళనం ఉగాది
వసంతం కోకిల సమ్మేళనం ఉగాది
పచ్చడి బొబ్బట్ల సమ్మేళనం ఉగాది
నూతన సంవత్సర శుభాకాంక్షలు !

- జ్యోత్స్న రెడ్డి

## నా తర్కం...

పంచ భూతాలు ప్రపంచాన్ని శాసిస్తాయని చెప్పిన దేవుళ్ళు డబ్బును మరిచారెందుకో !
వంద మంది అన్యాయాన్ని ఓడించిన అయిదుగురి మంచికీ దేవుడి అవసరం తప్పలేదేందుకో...
రావణ సంహారం చేసిన రాముడిని కన్న దశరథుడికి పుత్ర వియోగం, సీతకు పతి వియోగమెందుకో!
పార్వతికి సగ భాగమిచ్చిన పరమేశ్వరుడు తెలిసినంతగా గంగను తల మీద పెట్టుకున్న గంగాధరుడు తెలియడెందుకో!
**మన తర్కానికి అందితే అది పురాణమెందుకు**
**వందేళ్ల జీవితముంది పద ముందుకు !**

- యోగితా భాను బురం.

## విశ్వ విజేతలంట!

పస లేని ఆటను పడి పడి చూసేరు
రాత్రి పగలనక ఈ రంగుటద్దము లోన
ఒక్క నాడైనను గెలిచి చావరు గదా
విశ్వ విజేతలంట మన పిచ్చి గాని

గొర్రె మంద లాగ వెను తిర్గి వొచ్చేరు
బాతు గుడ్డులెన్నో పోగు బెట్టేరు
గంపెడు ఆశలన్నీ గంగలో కలిపేరు
విశ్వ విజేతలంట మన పిచ్చి గాని

ఒక్క ఇన్నింగ్సు గొప్పగా ఆడితే
నింగి కెగసి భలే విందు చేసేరు
మరునాడు డక్కు తో కొంప ముంచేరు
విశ్వ విజేతలంట మన పిచ్చి గాని

బంతి విసర లేక పరువు దీసేరు
ఇంట గెలిచిన వీరు రచ్చ గెలువలేరు
పద్మ రత్న అవార్డు దోచుకొని పోయేరు
విశ్వ జేతలంట మన పిచ్చి గాని...

- మురళి మోహన్ డింగరి

దేవుడు రాసింది జరిగితే నేను, నువ్వు అందరూ ఏదో ఒక రోజు చని పోవాల్సిందే! కానీ కొంత మంది ఆ తర్వాత కూడా జీవిస్తారు, ఆ పరమాత్ముడు ఎక్కడ రాయటం ఆపాడో అక్కడ మొదలు పెట్టి జీవితాన్ని రాసుకొని...

- వేద వైరాగి.

# మన పిల్లల పండగ ముచ్చట్లు

చిన్న చిన్న పిల్లలు మనకు చెపుతున్న పండగ విశేషాలు వారి మాటల్లోనే !



## వివేక్

నాకు దీపావళి అన్నిటికన్నా ఇష్టమయిన పండుగ. దీపావళి ఎందుకు సెలెబ్రేట్ చేసుకుంటాము అంటే, పూర్వం నరకాసురుడు అనే రాక్షసుడు అందరినీ బాధలు పెట్టేవాడు. అప్పుడు శ్రీకృష్ణుడు, అతని భార్య సత్యభామ నరకాసురుడుతో యుద్ధం చేసారు. సత్యభామ నరకాసురుడుని చంపేసింది. ఆ రోజు అమావాస్య, చీకటిగా ఉంటుంది. ప్రజలు అందరూ దీపాలు వెలిగించి వాళ్ళకి స్వాగతం పలికారు. టపాకాయలు కాల్చారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరమూ ఈ పండుగ రెండు రోజులు సెలెబ్రేట్ చేసుకుంటాము, మొదటి రోజు నరకచతుర్దశి, రెండవ రోజు దీపావళి. నాకు దీపావళి ఇండియాలో, హైదరాబాదులో జరుపుకోవటం ఇష్టము. నేను ఇప్పటివరకు ఇండియాలో నాలుగు సార్లు దీపావళి జరుపుకున్నాను. నేనూ, నా తాతగారూ, నా కజిన్స్ అందరమూ వెళ్ళి టపాకాయలు కొంటాము. అమ్మమ్మ యమ్మీ వంటలు చేస్తుంది. కొత్త బట్టలు వేసుకుంటాము. సాయంత్రము పూజ చేస్తాము. రాత్రి తాతగారి ఫ్యాక్టరికి వెళ్ళి, టపాకాయలు కాలుస్తాము. నాకు అన్నిటికన్నా రాకెట్ బాంబులు, పాము బిళ్ళలు కాల్చటం ఇష్టము. యు.ఎస్.ఏ లో దీపావళికి ఇంటికి లైట్స్ పెట్టిస్తాము, దీపాలు వెలిగిస్తాము. మా ఫ్రెండ్స్ ని డిన్నర్ కు పిలుస్తాము. అందరమూ టపాకాయలు కాలుస్తాము. బింగో లాంటి ఎన్నో ఆటలు ఆడుతాము.

అందుకే నాకు దీపావళి అంటే ఇష్టము. నాకు ఈ అవకాశం ఇచ్చిన WATS కి చాలా థాంక్స్ .

**- మీ వివేక్**



## నవ్య

సంక్రాంతి నాకు ఇష్టమైన పండగ. సంక్రాంతి పండుగ మనకు చాలా ముఖ్యమైన పండగ. ఆ రోజు కొత్త బియ్యం తో పిండి వంటలు చేసుకుంటారు. అరిసెలు మరియు సకినాలు వండుకుంటారు. ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేసుకుంటారు. మా అమ్మ మాత్రం రథం ముగ్గు వేస్తుంది.

లక్ష్మి దేవి ఇంట్లోకి ఆ రథం మీదనే వస్తుందని అంటారు. వేసిన ముగ్గుల మీద గోబ్బెమ్మలు పెడతారు. గొబ్బియాలో అని పాటలు పాడుతారు. ఆ రోజు మొత్తం అలా ఆట పాటలతో గడిచి పోతుంది. ఈ పండగ మూడు రోజులు జరుపుకుంటారు.

మొదటి రోజును భోగి అంటారు. ఆ రోజు ఉదయం భోగి మంటలు చాలా మా ఊర్లో వేస్తారు. పండగ పిండి వంటలు వండి తిని సాయంత్రం చిన్న పిల్లలందరిని కలిపి ఒక చోట భోగి పళ్ళు పోస్తారు. అది చాలా బాగుంటుంది. పోసే పళ్లన్ని పెద్దలు పిల్లలకు దీవెనలిస్తారన్నమాట!

ఇక మరుసటి రోజు అసలైన సంక్రాంతి పండగ. ఉదయమే లేచి తల స్నానం చేసి కొత్త బట్టలు వేసి దేవుడి పూజ చేసుకుంటాం. పూజ అవ్వగానే ప్రసాదం తిని ఆడుకుంటాం. బుర్ర కథ లాంటి ఎన్నో విషయాలు ఆ రోజు తెల్సుకున్నాము.

మరసటి రోజును కనుమ పండగ అంటారు. ఈ పండగలను మేము ఈ సంవత్సరం సియాటెల్ లోనే జరుపుకున్నాం. నేను WATS సంక్రాంతి ముగ్గుల పోటీలో పాల్గొన్నాను కూడా! అందరం కాసేపు అలా సంప్రదాయపు వస్త్రాలతో ఆడుకుంటూ ఉంటే నాకు చాలా బాగా అనిపిస్తుంది.

**- మీ నవ్య**

# మన పిల్లల పండగ ముచ్చట్లు

చిన్న చిన్న పిల్లలు మనకు చెపుతున్న పండగ విశేషాలు వారి మాటల్లోనే !



మేఘన

నా పేరు మేఘన గంగిపాముల. నాకు మరియు నా తమ్ముడు రిఖిల్ కి ఉగాది పండగ అంటే చాల చాల ఇష్టం . మన తెలుగు వారి అందరికి కొత్త సవత్సరం ప్రారంభం అయ్యేది ఉగాది పండగతోనే . మా నాన్న గారు చెప్పారు , తెలుగువారి నమ్మకం ప్రకారం ఉగాది రోజునే బ్రహ్మ సృష్టిని ప్రారంబించాడు అంట.

మనకు ఒక సంవత్సరం గడిస్తే, బ్రహ్మకు ఒక రోజు గడిచినట్టు అంట. అంటే మన ప్రతి ఉగాదితో , బ్రహ్మకు కొత్త రోజు ప్రారంభం అన్న మాట. ఉగాది రోజున మా ఇంటిలో అందరం ఉదయమే నిద్ర లేచి అందరం తయ్యారు అవుతాం. మా నాన్న గారు పూజకి కావాల్సిని అన్ని రెడీ చేస్తారు . మా అమ్మ ఉగాది పచ్చడి తాయారు చేసుంది. మాకు ఉగాది పచ్చడి అంటే చాల ఇష్టం. తమ్ముడు పూజ అవ్వక ముందే పచ్చడి తింటాను అని అల్లరి చేస్తాడు, ఎందుకంటే అది వాడికి చాల ఇష్టం. అప్పుడు అమ్మ వాడిని వొప్పించి , పూజ ఐన తరువాత ఇస్తాను అని చెపుతుంది. పూజ ఐన తరువాత, మేము ఉగాది పచ్చడి మరియు పిండివంటలు ప్రసాదంగా తింటాము. ఆ తరువాత, నేను మరియు తమ్మడు కలిసి మా స్నేహితుల ఇంటికి వెళ్లి, ఉగాది పచ్చడి మరియు పిండివంటలు ఇచ్చి, తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పి వస్తాం. ఆ రోజు సాయంత్రం మేము అంతా కలిసి తప్పకుండ దేవాలయంకి వెళ్లి , దేవుడుని మొక్కు కొని వస్తాం. నేను ప్రతి ఉగాది కి WATS వారు ఉగాది సంరంభంలో, డ్యాన్స్ గాని, పాట గాని నేర్చుకొని నా ఫ్రెండ్స్ తో కలిసి చేస్తాను.

మీ అందరికి కూడా ఉగాది శుభాకాంక్షలు. మన తెలుగు పండగలు ఏవయిన నాకు మా తమ్ముడికి చాలా ఆనంద క్షణాలు.

**- మీ మేఘన మరియు రిఖిల్**



తన్మయి

నాకు ఇష్టమయిన పండుగ 'వినాయక చవితి'. ఆ రోజు వినాయకుడి పుట్టిన రోజు. శివుడు వినాయకుడిని అందరి దేవతల కన్నా ముందు పూజించమని చెప్పిన రోజు ఈ 'వినాయక చవితి'.

ఈ పండుగ మామూలుగా ఆగస్టు 19 – సెప్టెంబరు 15 మధ్యలొ వస్తుంది. ఆ రోజు ఒక మట్టి వినాయకుడిని ఇంటికి తెచ్చి 21 రకాలు ఆకులతో / పువ్వులతో పూజ చేస్తారు. వినాయకుడి కథ వింటారు. మనం అనుకున్న పనులన్ని విఘ్నాలు లేకుండ జరగాలని కోరుకుంటారు. వినాయకుడికి ఇష్టమయిన పిండి వంటలు చేసి ప్రసాదం పెడతారు. కొత్త బట్టలు వేసుకుంటారు. వినాయకుడికి పూజ చేసిన తరువత ఆ విగ్రహాన్ని నీటిలొ నిమజ్జనం చేస్తారు. ఈ పండుగని ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలలో బాగా జరుపుకుంటారు. మీకు తెల్సునో లేదో కానీ మనం అన్నిటికన్నా ముందు పూజించే దైవం ఈ గణ నాథుడే! శుక్లాంబరధరం శ్లోకం ఈ దేవ దేవుడిదే...

మా వీధిలో పెద్ద వినాయకుడిని పెడతారు, అది చూట్టానికి రెండు కళ్ళు సరిపోవంటే నమ్మరు. మేము ఆ వినాయకుడి ముందు ప్రసాదం పెట్టటం, నమస్కారాలు పెట్టటం అన్నీ పిల్లలమంతా కలిసి చేసేవాళ్ళము. ఉండ్రాళ్ళు తిన్నావయ్య వినాయక! ఊడిగం చేస్తామయ్య వినాయక అని పాటలు కూడా పాడుకుంటాం. అందుకే బొజ్జ గణపయ్య నా ఫేవరెట్ దేవుడు. ఆయన పుట్టిన రోజు నాకిష్టమయిన పండగ రోజు.

**- మీ తన్మయి మరియు తనయ్**

# మన పిల్లల పండగ ముచ్చట్లు

చిన్న చిన్న పిల్లలు మనకు చెపుతున్న పండగ విశేషాలు వారి మాటల్లోనే !



మధు ప్రశంస

అందరికి హాయ్, నేను మధు, మా నాన్న శ్రీనివాస్ గారు, మా అమ్మ లావణ్య గారు, మా తమ్ముడు సూర్య ప్రతీక్ రెడ్డి. నాకు మా తమ్ముడు అంటే చాలా ఇష్టం. అలాగె నాకు మన పండుగలు అంటే కూడా చాలా చాలా ఇష్టం. అందులో నాకు ముఖ్యంగా సంక్రాంతి, ఉగాది, దీపావళి, రాఖీ మరియు హోళీ పండగలు మరీ ఇష్టం. ఇప్పుడు నేను మీకు సంక్రాంతి పండగ గురించి కొన్ని మంచి ముఖ్యమయిన విషయాలు చెప్పాలని అనుకుంటున్నాను. సంక్రాంతి పండగ కొత్త సంవత్సరంలో వచ్చే తొలి పండుగ చాల పెద్ద పండుగ. ఈ పండుగ రోజున నేను ఇండియా లో ఉన్నప్పుడు, ఉధయము లేచేసరికి మా ఇంటి ముందు ముగ్గులు అమ్మ వేస్తూ ఉంటే నాకు రంగులు నింపటము చాలా ఇష్టము, అమ్మను ఆ పేరుతో విసిగించటం ఒక సరదా! అలా సరదాగా ప్రాంభమయిన పండగ రోజుని తలారా స్నానం చేసి నాన్న తెచ్చిన కొత్త బట్టలు వేసుకొని ఆటలు మొదలు పెడతాను. అన్నట్టు మరచిపోయాను! అంతకు ముందే దేవుడి దగ్గర పూజ చేసి ఆశీర్వాదం తీసుకొంటాను కూడా . ఇంట్లో ఉన్న పనికి రాని కట్టెలు అన్నీ తీసి వేసే భోగి మంటలు చాలా ఫేమస్. మా చిన్న పిల్లలకంతా అమ్మ వాళ్ళు పోసే భోగి పళ్ళు, చింత చెట్ల కింద వేసే ఉయ్యాల, డు డు బసవన్న, హరిదాసులు ఇన్ని విశేషాలు ఏ పండగలో ఉన్నాయో మీరే చెప్పండి. నేను సియాటెల్లో ఉన్నా కూడా ప్రతి పండగని WATS వారితో ఇండియాలో మాదిరి జరుపుకోవటం చాలా హ్యాపీగా ఉంటుంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన WATS కి చాలా థాంక్స్ .

**- బై మీ మధు మరియు సూర్య**



నిపుణ్

హోళి పండుగ అంటె నాకెంతో ఇష్టము. ఆ రోజ బాగా రంగులతో ఆడుకోవచ్చు. నా స్నేహితులు అందరిని రంగులతో ముంచి వెయ్యొచ్చు. మా అమ్మ ఆ రోజ రక రకాల కుకీస్, బిస్కెట్స్ తో మాల చెసి నాకు వేస్తుంది. ఈ సారి మా తాత కి విషెస్ చెప్పుదామని కాల్ చేసా.. అప్పుదు తాత గారు చెప్పిన హోళీ పండగ విషయాలు ఇదిగో మీ కోసం… హోళీ పండగ హిందువుల సంప్రదాయాలకు చిహ్నం. ఇది మన హిందూ పురాణాల్లో చెప్పబడి వుంది. హోళీ శీతాకాలం చివరన, వసంతం ముందు జరుపుకునే పండగ. ఇది మన దేశంలో చాలా ప్రదేశాలలో జరుపుకుంటారు. హోళీ పండుగ హోళీ మంటలతో ఆట పాటల మధ్యన జరిగే పండుగ. పురాణ ప్రకారముగా హిరణ్యకశ్యపుడు చెల్లె, ప్రహ్లాదుడి అత్త అయిన హోలిక అనే రాక్షసి వల్ల ఈ పండుగకు ఆ పేరు. ఈ రోజు హోలిక ప్రహ్లాదుడిని మంటలలోకి తీసుకువెళ్ళి తనకు మంటలు అంటకుండా ఒక శాలువా కప్పుకొని ప్రహ్లాదుడిని మాత్రం అలాగే తీసుకువెళ్ళింది. కాని గాలి వీచి ప్రహ్లాదుడిని కాపాడి హోలిక మంటలలో కాలిపోయేలా చేసింది. విష్ణు మూర్తి హిరణ్యకష్యపుడిని చంపి తన భక్తుడు అయిన ప్రహ్లాదుడిని కాపాడాడు. అందుకని ఆ రోజున చెడు మీద మంచి గెలిచిన రోజు. అంతే కాక హోళీ రోజున ఆనందంగా చిన్న పెద్ద కుల మత తారతమ్యం లేకుండా రంగులు చల్లుకుంటారు. ఆ తరువాత తలంటు స్నానం చేసి కొత్త బట్టలు వేసుకొని బంధువులతో స్నేహితులతో కలిసి ఆనందంగా ఉంటారు. అలాగే కొన్ని చోట్ల పిల్లలకు ఇష్టం అయిన వాటితో మాలలు చేసి పిల్లలకు వేస్తారు. ఇది పిల్లల మీద వున్న చెడు ధృష్టిని తీసివేయడానికి గుర్తుగా వేస్తారు. ప్రజలంతా సర్వ మానవ సమానాత్వానికి చిహ్నంగా సంతోషంగా జరుపుకునే పండుగ. మీ హోళీని మీరు చాలా ఆనందంగా జరుపుకుంటారుగా!

**- మీ నాలుగడుగుల బుల్లెట్టు- - నిపుణ్**

# మన పిల్లల పండగ ముచ్చట్లు

చిన్న చిన్న పిల్లలు మనకు చెపుతున్న పండగ విశేషాలు వారి మాటల్లోనే !



**సాయి సిరి**

దీపావళి దీపాల పండుగ. మేము దీపాలు మరియు టపాకాయలతో ఇళ్ళు అలంకరించుకుంటాం. అసలైన దీపావళి పండగ రెండు రోజులు. మొదటి రోజు నరక చతుర్దశి మరియు రెండవ రోజు దీపావళిగా జరుపుకుంటారు. చాలా కాలం క్రితం నరకాసురుడు అనే చెడు రాక్షసుడు ఉండే వాడు, అతను అందరికంటే ఎక్కువ శక్తివంతమైన వాడని భావించి తనను ఓడించడానికి ఎవ్వరూ సాటి రారని భావించాడు. అతను చాలా అమాయక ప్రజలను, ముఖ్యంగా స్త్రీలను హింసించాడు. అప్పుడు ప్రజలంతా శ్రీ కృష్ణుడు దగ్గరికి వెళ్లి నరకాసురుడు పెడుతున్న బాధల గురించి చెప్పారు. అప్పుడు కృష్ణుడు, ఆయన భార్య సత్యభామ నరకాసురుడి పైన యుద్ధము చేసిరి. ఒక దీర్ఘ యుద్ధం తరువాత, శ్రీ కృష్ణుడు మూర్ఛ పోవటం తో సత్యభామ నరకాసురుని చంపివేసింది. అప్పటి నుండి ప్రజలు సంతోషంగా నరకాసురుడి మరణాన్ని దీపాలతో ఇంటికి అలంకరణ చేసి టపాకాయలు పేల్చి జరుపుకుంటారు. మేము కూడా ఇదే విధముగా ప్రతి సంవత్సరం దీపావళి జరుపుకుంటాము.

పిండి వంటలతో ఆ రోజు అమ్మ చేసిన పాయసం పులిహోర తిని సెలెబ్రేట్ చేస్తాము. మా ఊర్లో HTCC ఆలయ ప్రాంగణంలో అందరూ కలిసి టపాకాయలు కాలుస్తారు. ఆ రోజు కన్నుల పండగగా ఉంటుంది. కానీ ఇండియాలో అయితే ప్రతి ఇంటి ముందు కాల్చుకుంటారు. ఏ పండగ అయినా చెడు ఓడి మంచి గెలిచినందుకు గుర్తుగా జరుపుకుంటాం. అందుకే నాకు అన్నీ పండగలు ఇష్టం!

- మీ సాయి సిరి



**అభి**

**దుర్గాష్టమి** - దుర్గాదేవి 'లోహుడు' అనే రాక్షసుని వధిస్తే లోహం పుట్టిందని, అందువల్ల లోహపరికరాలని పూజించే ఆనవాయతి వచ్చింది అని చెప్తారు. ఇక దుర్గ అంటే? దుర్గమైనది దుర్గ. దుర్గతులను తొలగించేది దుర్గ. ఈమె దుర్గేయురాలు కనుక దుర్గ అయింది. 'దుర్గలోని 'దుర్' అంటే దుఃఖం, దుర్భిక్షం, దుర్వ్యసనం, దారిద్ర్యం మొదలైనవి. 'గ' అంటే నశింపచేసేది' అని దైవజ్ఞులు వివరణ చెప్తూ ఉంటారు. అందువల్లనే మొదటి మూడు రోజులు దుర్గారూపాన్ని ఆరాధించి అరిషడ్వర్గాలను, తదుపరి మూడురోజులు లక్ష్మీరూపాన్ని ఆరాధించి సిరిసంపదలను, చివరి మూడురోజులు సరస్వతిరూపాన్ని ఆరాధించి జ్ఞానాన్ని, ఇలా నవరాత్రులు ఆ తల్లిని ఆరాధించి ఫలితాలు పొందవచ్చునని పెద్దలు చెప్తుంటారు. **మహర్నవమి** — మానవకోటిని పునీతులను చేయుటకు భగీరదుడు గంగను భువినుండి దివికి తెచ్చినది ఈనాడే. ఇక ఈ నవరాత్రి దీక్షలో అతి ముఖ్యమైనదిగా ఈ నవమి తిధిని గూర్చి చెప్పుటలో ఆంతర్యం ఈ తొమ్మిదవ రోజు మంత్ర సిద్ధి కలుగును. కావున 'సిద్ధదా' అని నవమికి పేరు. ఇక క్షత్రియులు, కార్మికులు, వాహన యజమానులు, ఇతర కులవృత్తులవారు అందరూ ఆయుధపూజ నిర్వహిస్తారు. **విజయదశమి** — దేవదానవులు పాలసముద్రమును మధించినప్పుడు అమృతం జనించిన శుభముహూర్తదినం ఈ రోజే. 'శ్రవణా' నక్షత్రంతో కలసిన ఆశ్వీయుజ దశమికి 'విజయా' అనే సంకేతమున్నది. అందుకనే దీనికి 'విజయదశమి' అని పేరు. 'శమీపూజ' చేసుకునే ఈరోజు మరింత ముఖ్యమైనది. శమీవృక్షమంటే 'జమ్మిచెట్టు'. అజ్ఞాతవాసమందున్న పాండవులు వారివారి ఆయుధములను, వస్త్రములను శమీవృక్షముపై దాచి వుంచారు. అజ్ఞాతవాసము పూర్తి అవగానే శమిని పూజించి, తిరిగి ఆయుధాలను వస్త్రములను పొంది, వృక్ష రూపమున ఉన్న 'అపరాజితా' దేవి ఆశీస్సులు పొంది, కౌరవులపై విజయము సాధించినారు. శ్రీరాముడు ఈ రోజున ఈమెను పూజించి, రావణుని సహరించి, విజయము పొందినాడు.

- **మీ అభి**

# మన పిల్లల పండగ ముచ్చట్లు

చిన్న చిన్న పిల్లలు మనకు చెపుతున్న పండగ విశేషాలు వారి మాటల్లోనే !



**రిషిత, రేయాన్ష్**

దీపాల పండుగ దీపావళి మాకు అన్నిటికన్నా ఇష్టమయిన పండుగ. మా ఇల్లంతా మట్టి దీపాలతో, లైట్స్ తో నింపడం మాకు సరదా. అలాగే ఇల్లంతా పువ్వులతో, ముగ్గులతో అలంకరిస్తాము. ఈ పండుగని మేము కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి సెలబ్రేట్ చేసుకుంటాము. మా డాడీ, మేము కలిసి బయట లైట్లు పెడతాము. అమ్మ ఇంటి లోపల ముగ్గులు పెడుతుంది. మేము ఆ ముగ్గులకి రంగులు దిద్ది,దీపాలతో అలంకరిస్తాము. నరకాసురుడనే రాక్షసుడిని సంహరించన మరుసటి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. అలాగే లంకలోని రావణుడిని సంహరించి శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినపుడు కూడా ప్రజలు ఆనందోత్సవాల మధ్య దీపావళిని జరుపుకున్నారని రామాయణం చెపుతోంది. చీకటిని త్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారు. దీప మాళికల శోభతో వెలుగొందే గృహాంగణాలు, ఆనంద కోలాహలంతో వెల్లివిరిసే ఆబాల గోపాలం, నూతన వస్త్రాల రెపరెపలు, పిండి వంటల ఘుమఘుమలు, బాణసంచా చప్పుళ్ళు, ఈ దివ్య దీపావళి సోయగాలు. ఈ పండుగ ప్రతియేటా ఆశ్వయుజ అమవాస్య రోజున వస్తుంది. ఈ పండగ ముందు రోజును నరక చతుర్ధశిగా జరుపుకుంటారు. దీపావళి రోజు అన్నిటికంటె సరదా విషయం ఏమిటంటే స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి టపాకాయలు కాల్చటం. అలాగే అమ్మ,నాన్న వాళ్ళ చిన్నప్పుడు దీపావళి ఎలా జరుపుకునేవారో చెబుతుంటే వినటం మాకు చాలా ఇష్టం. కానీ దీపావళికి మేము బాగా మిస్ అయ్యేది మా అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలని. వచ్చే సంవత్సరం ఇండియాలో దీపావళి వారందరితో కలిసి జరుపుకోవాలని కోరుకుంటున్నాము. మరలా దీపావళి ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాము. బై !

**- మీ రిషిత మరియు రేయాన్ష్**



**సాయి ఆశ్రిత**

హాలో పిల్లలూ! నమస్తే పెద్దలూ! మా నాన్న నన్ను నచ్చిన పండగ గురించి చెప్పమన్నారు. నాకు పూలంటే చాలా చాలా ఇష్టం. అందుకే బతుకమ్మ పండగ అంటే నాకు ఇష్టం. ఎందుకంటే ఆ రోజు అమ్మ అన్నీ రకాల పూలు కొని వాటితో బతుకమ్మను తయారు చేస్తుంది. కిందటి సంవత్సరం మా స్నేహితులతో ఈ పండగ సియాటెల్ లో ధూం ధాం గా జరుపుకున్నాము. అందరూ కలిసి రౌండ్ తిరుగుతూ బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని పాట పాడాము.

ఆ రోజు మా ఊర్లో ఇంటి ముందు కళ్ళాపి జల్లి మంచి మంచి ముగ్గులు వేస్తారు. వాటికి రంగులు మేము పెడతాము. అమ్మ వారికి ఇంట్లో పెద్దలంతా చేరి పూజలు చేస్తారు. నాన్న వాళ్ళు వెళ్ళి చాలా చాలా రకాల పూలు తీసుకొని వస్తారు. అంతలో అమ్మ పిండి వంటలు అన్నీ వండేస్తుంది. అవి అన్నీ తినేసి మేము పిల్లలమంత ఆడుకుంటాం. కొద్ది సేపటికి అమ్మ మరియు తన స్నేహితులు ఒక చోట కూర్చొని పూలు పెట్టుకొని బతుకమ్మ చేయటం మొదలు పెడతారు. ఇక్కడ అయితే బతుకమ్మను మేము WATS వాళ్ళు ఏర్పాటు చేసిన హాల్లో చేసేసాము. బతుకమ్మ రెడీ అయ్యాక గుడికి వెళ్ళి అన్నీ బతుకమ్మలు ఒక చోట పెట్టి చుట్టూ చేరి క్లాప్స్ కొడుతూ పాటలు పాడుతూ తిరుగుతాము. అది చాలా బాగుంటుంది.

పూజలన్నీ అయ్యాక ఎవరెవరి బతుకమ్మను వాళ్ళు నీటిలో వదిలేస్తారు. మా నాన్న అమ్మ బాగా దండం పెట్టుకోమని చెప్తారు. మళ్ళీ ఇంటికొచ్చి మేము బాగా ఆడుకొంటాము. అందరూ పెద్దలూ, పిల్లలూ కలిసి ఆ రోజు బతుకమ్మ పాటలు పాడటం నాకు ఎప్పటికీ గుర్తు ఉంటుంది.

**- మీ చిట్టి ఆశ్రిత**

# నా తెనుంగు తేట వెలుగుల తెలుగు...

రఘు ప్రసాద్ బి ఆర్ (raghu4sangeeth@gmail.com)

'ఆంధ్రత్వమాంధ్ర భాషాచ నాల్పస్య తపసః ఫలమ్' అని పెద్దలు ఊరికే అనలేదు. దీని అర్థం - "తెలుగు వాడిగా పుట్టటం ఒక వరం". ద్రావిడ భాషల్లో తెలుగుకున్నంత తీపి కొండ తేనెకెక్కడిది అన్నారట. నా మట్టుకైతే తెలుగు భాషను మాట్లాడటం ఎన్నో జన్మల తపఃఫలం. ఒక్క తెలుగు నాటే కాదు నేల నాలుగు చెరగుల మన తెలుగుభాష... వెలుగుభాష, తేటతెలుగు-మేటితెలుగు, తేనెలొలికే తెలుగు జానుతెలుగని కీర్తి గడించింది. నేను, మీరు మనమందరం పలికిన తియ్యనైన "అమ్మ" అనే మొదటిమాట అందించినభాష నా తెనుంగే...

సాక్షాత్తు శివ స్వరూపమయిన త్రిలింగ దేశపు కాళేశ్వరం, శ్రీశైలం, భీమేశ్వరంల పుణ్య వర్చస్సును అదిమి పట్టుకొని, పౌర్ణమి చంద్రుడి తెరపి వెన్నెలల ఆణిముత్యాల సొబగు, పునుగు, జవ్వాజి, ఆమని పూలవలపు, మురళిరవళులు, కస్తూరి పరిమళాలు కలిసి ఏర్పడిన భాష మన తెలుగు బాష. అందుకే ఆ ఎనలేని మాధుర్యం, ఎంత మాట్లాడినా తనివి తీరని సోయగం. నన్నయ భారతపు తొలి సుధామయ సూక్తులలో ఓలలాడి.... తిక్కన రణతంత్రపు యుక్తులతో రాటుదేలి, ఎర్రన వర్ణనలతో సొబగులూని, శ్రీనాథుడి ప్రబంధ రాజసంతో హొయలు నేర్చి, పోతన భక్తిమాధురిలో ఒదిగిపోయి, పెద్దన మను చరితముతో పదనిసలు నేర్చి, రాయల ప్రౌఢిలో దేశ బాషలన్నింటిలో లెస్స అనిపించుకొని... త్యాగరాజు పాటయి, చిన్నయ సూరి వ్యాకరణమై, కందుకూరి వారి సాంఘీక విప్లవమై, వేటూరి చిలిపి పాట నుంచి గద్దర్ గజ్జె కట్టి ఆడిన ఆట వరకు, నాటికి, నేటికీ మన కవుల కలాల్లో మన తెలుగు గళాల్లో చైతన్యం నింపిన భాష... మొత్తం భారత జాతికి జాగృతి నందించిన భాష నా తెలుగు భాష.

'విశ్వశ్రేయః కావ్యమ్' అని చాటి చెప్పిన భాష మన తెలుగు భాష. నిగ్గదీసి అడగమన్న సిరివెన్నెల, ధైర్యం మాత్రమే ఉందన్న చలం , నేను సైతం అని తిరుగుబాటు బావుటా ఎగరేసిన శ్రీశ్రీ వారి ఆర్ద్రత నా తెలుగు భాష. వినుర వేమ అంటూ మానవత్వపు మొదటి 4 మాటలు చెప్పిన వేమన, ప్రపంచ గ్రంథాలెన్నో స్పర్శించలేనన్ని నీతి సుద్దులను అతి సులువుగా చెప్పిన బద్దెన్న, వెంకన్ననూ నేలకు దించిన మన అన్నమయ్య పాట మోసిన సాహితి శిఖర పతాక నా తెలుగు భాష. దొరకునా ఇటువంటి సేవ అంటూ ప్రతి సారి మనందరి నోట నానే త్యాగయ్య నాదాలు, పలికెడిది భాగవతమట, పలికించెడి వాడు రామభద్రుండట నే పలికిన భవహర మగునట పలికెద వేరొండు గాథ పలుకగనేల అని స్వీయ కృతాన్ని దైవ నిర్ణయమని ప్రకటించిన నన్నయ్య భాగవతం నా తెలుగు నేల పుట్టిన సాహితి వరి పైరు. లేపాక్షి శిల్ప వైభవం జక్కన మన తెలుగు వారి ఖ్యాతి దిగంతాల జేర్చిన అద్భుతమే! రాయల వారి ఆముక్త మాల్యద, దేవులపల్లి వారి రసికత, విశ్వనాథుల రామాయణ కల్పవృక్షం, సినారె విశ్వంభర, గురజాడ కన్యాశుల్కం, రావూరి భరద్వాజ గారి పాకుడు రాళ్ళు శిఖర సమానమయిన రచనలంటే అసలు అతిశయోక్తి కాదేమో! అలసాని, ధూర్జటి, తెనాలి రామన్న లాంటి తెలుగు కవులు మాత్రమే కాగలిగారు రాయల వారికి దిగ్గజాలు!

బుడుగు రచనల నుంచి, శ్రీధర్ కార్టూన్ల దాకా తెలుగు వారి హాస్య ప్రియత్వం ప్రస్ఫుటం. అంతెందుకు గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అవలీలగా ఆనందపు దస్తూరి చేసిన మన బ్రహ్మానందం – నవ్వుల పువ్వులను పూయించే నా భాషకీ మాత్రమే పరిమితమయిన అద్భుతం. ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని 16వ శతాబ్దాము లోనే పేరుగొన్ననూ, ద్రావిడుల భాషల్లో తలమానికమని ప్రపంచ పర్యాటకులంతా కొనియాడిన తెలుగు భాష అభిమానులు కాలానికి, ప్రాంతానికి అప్పుడు ఇప్పుడు ఎప్పుడు పరిమితం అవ్వలేదు. నృత్య ప్రపంచానికి కూచిపూడిని తెలుగు జాతి సగర్వంగా అందించింది. సర్వేపల్లి రాధాకృష్ణ, నీలం సంజీవ రెడ్డి, పి వి నరసింహా రావు లాంటి జాతీయ స్థాయి రాజకీయ దిగ్గజాలు తెలుగింటి వారే. ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్, ఎస్.వీ.ఆర్ లాంటి జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకున్న నట విరాట్టులు తెలుగు భాష కు మాత్రమే సొంతం. చెప్పుకుంటూ పోతే చెంతాడు, రాసుకుంటే పోతే రామాయణం అనే సాహితి సంపద నా భాష సొత్తు... మనసు కవిగా ఆత్రేయ ప్రస్థానం, జానపదుల వెంపటి చినసత్యం లాంటివి నేను ఈ నాలుగు మాటల్లో పూర్తి చేయలేని నా తెలుగు సాహితి సంరంభం. మనః పూర్తి గా, సంపూర్తిగా నా భాషను శిఖరాగ్రాన నిలబెట్టిన ప్రతి మనిషిని, మనీషిని గుర్తు చేసుకోవాలని నేను చేసిన ఈ నా చిన్న ప్రయత్నం ఖచ్చితంగా కొంతమంది మహానుభావులని మినహాయించి ఉంటుందని బలంగా విశ్వసిస్తూ, నా తెలుగు భాషకు సేవ చేసుకున్న అదృష్టం ఒక కలం, ఒక పేజీలో పూర్తి చేయలేనంత మంది మహానుభావులదని బలంగా విశ్వసిస్తూ ... సియాటెల్ వారందరి తరఫున ఎందరో మహానుభావులు! అందరికీ వందనములు.

**- రఘు భరద్వాజ్**


SUREKHA K. MURTHY
Real Estate Professional
(425) 941 0654
Surekha@Windermere.com
RESIDENTIAL ♦ NEW CONSTRUCTION ♦ INVESTMENTS
www.SKMHomes.com
Windermere
Windermere Real Estate/Northeast, Inc.


Dr. Madhuri Vanama
DISCOVERY DENTAL
AT ISSAQUAH HIGHLANDS
• Family oriented care
• Preferred provider with all major insurances.
• Evening and Saturday appointments available
• Treatment rooms with heat and massage chairs with TV
• Advanced technology
• Relaxing sedation options
• Discovery Dental Member Program
• Same day emergency appointments
• Flexible financing available
• Free 2nd opinion and consultations
Call to make an appointment at
425.295.7975
New patient specials!
$100 Gift Card +$50 Gift Card
(*$100-1st Fam. Member+ **$50-2nd Fam. Member)
For new patients only with exam, x-rays & cleaning. Subject to availability. Limit 2 cards per family. Your choice of gift card from Costco, Target or Dental Dollars.
#DDNP01
OR
FREE Zoom®! Whitening
(FREE take-home bleaching trays)
For new patients age 18+ years only. Valid after exam, x-rays and cleaning. Subject to availability.
#DDNP01
OR
FREE Sonicare® Toothbrush
(For Adults or Kids)
For new patients only. Valid after exam, x-rays and cleaning. Subject to availability.
#DDNP01
A Unique Dental Experience
959 NE Discovery Drive Issaquah, WA 98029
www.discoverydentalwa.com


Apna Bazar
Fresh Produce • Groceries • Chaat • Movies
Spacious Shopping / Friendly Service.
Convenient locations in Bellevue & Bothell. Ample parking space.
Large selection of Spices,
Fresh Vegetables, Frozen Products, Everyday Snack's & more.
BELLEVUE
2245, 148th Ave NE, Bellevue, WA - 98007
Phone : 425 644 6887,
Fax : 425 484 7000
BOTHELL
20710, Bothell Everett Highway,
Bothell, WA - 98012
Phone : 425 485 9900, Fax : 425 488 6200
SAMMAMISH
Sammamish Highlands, 516, 228th Ave NE & 8th Street NE
Sammamish WA - 98074 ( Near Safeway)
Phone : 425 868 0900
Email : contactus@apnabazarstores.com
Available at Facebook at : http://www.facebook.com/apnabazarstore


Praka Sahi, DDS • Kyle S. Blair, DDS • Daniel Hwang, DDS • Zach Streit, DDS
BelRed Dentists
Our services include:
• Sedation Dentistry (Oral and Nitrous)
• Cosmetic Dentistry (Crowns, Veneers, Bridges, smile makeover)
• Pediatric Dentistry
• Root Canals
• TMJ, Night/sports guards
• Extractions (Surgical Wisdom teeth)
• Implants & Implant crowns
• Teeth Whitening
• Dentures/Partials
• Emergency: same day treatment
• Accepting kids as young as 6 months
WATS MEMBERS OFFER
$50 Off Dental Treatment
New patients only. Can only be used with services of $300 or greater. No cash value. Not valid with any other offers or prior services. Expires 05/31/2014. Certain insurance limitations and exclusions may apply
SPECIAL OFFER
FREE TEETH WHITENING
Valid with new patient exam, full mouth X rays and necessary cleaning. Limit 1 per patient. No cash value. Not valid with any other offers or prior services. Expires 05/31/2014
Call
425.641.5000
for appointments
Mon-Fri 8am-6pm
Sat 8am-4pm
We accept most insurances.
We offer relaxed environment with TV / Movies and WiFi.
Conveniently located close to 520 and Microsoft - 2217 152nd Ave. NE, Suite 150, Redmond, WA 98052

# శుభాభినందనలతో...

**వాషింగ్టన్ తెలుగు సమితి సభ్యులకు జయ నామ సంవత్సర శుభాకాంక్షలు.**

## www.pujamandir.com

Your one-stop shop for wooden puja mandirs.

Tel: 425 224 5786

## Eyelevel of Redmond East

**(www.eyelevelredmondeast.com)**

Mail: redmondeast@myeyelevel.com

Tel: 424 999 4685

## Lake Hills Orthodontics

**(www.lakehillsortho.com)**

15446 Bel-Red Road Suite 310 Redmond 98052

Tel: 425 747 9210

## Aly Easthouse

**(Sports Physical Therapy & Performance Centers)**

1601 116th Ave Ne Suite 101 Bellevue, WA 98004

Tel: 425 628 2072

## Ravishing Fashions & Handicrafts

16540 Redmond Way, Redmond WA 98052

**Facebook**: Ravishing Marketplace

Tel: 425-558-5400, 425-418-7181



# మన పండగ వంటలు

తెలుగు పండగల్లో వంటలకు ఒక ప్రముఖ స్థానం ఉంది. కొన్ని పండగ వంటలు మీ కోసం మన సియాటెల్ గృహిణుల నుండి మీ కోసం...



## క్యాబేజి కొబ్బరి చట్నీ

**కావాల్సిన పదార్థాలు:**

క్యాబేజి- 1 కప్పు, తురిమిన కొబ్బరి -1/4 కప్పు
పచ్చి మిర్చి -5 (రుచిని బట్టి), జీలకర్ర -1 స్పూను
చింతపండు - 1 రెబ్బ(దీని బదులు పచ్చి మామిడికాయ కూడా వెయ్యొచ్చు) , ఉప్పు - రుచిని బట్టి
నూనె
వెల్లుల్లి రెబ్బలు- 2
తాలింపు కోసం: కరివేపాకు ,ఎండుమిర్చి,ఆవాలు,మినపప్పు,పచ్చి సెనగపప్పు.

**తయారు చేయు విధానం:**

కడాయిలో నూనె వేడి చేసి,అందులో జీలకర్ర, పచ్చి మిర్చి, వెల్లుల్లి రెబ్బలు, చింతపండు, ఉప్పు వెయ్యాలి. మిర్చి వేగాక కొబ్బరి వేసి పచ్చి వాసన పోయేదాకా ఒ నిమిషం పాటు వేయించాలి. ఇవి చల్లారాక మిక్సీలో వేసి తిప్పాలి. అదే కడాయిలో కొంచెం నూనె వేసి, తురిమిన క్యాబేజి వేసి పచ్చి వాసన పోయేదాకా వేయించాలి (మరీ మెత్తగా అవకూడదు). ఇప్పుడు క్యాబేజి కూడ మిగిలిన వాటితో పాటు మిక్సీలో వేసి, ఒక్కసారి తిప్పాలి. కడాయిలో కొంచెం నూనె వేడి చేసి ఆవాలు, పచ్చి సెనగపప్పు, మినపప్పు, కరివేపాకు, ఎండుమిర్చి వేసి, ఆవాలు చిటపటలాడాక చట్నీలో కలపాలి. ఘుమ ఘుమ లాడే క్యాబేజీ కొబ్బరి చట్నీ సిద్ధం!

**– అనురాధ గోపాళం**



## రైస్ మంచూరియన్

**కావాల్సిన పదార్థాలు:**

ఉడికించిన బంగాళాదుంప ఒకటి, క్యాబేజి తురుము అర కప్పు, బఠానీలు అర కప్పు కొత్తిమీర తురుము టేబల్ స్పూను, అన్నం కప్పు, ఉప్పు సరిపడా, ఎండు మిర్చి ఒకటి, మైదా అర కప్పు, సోయా సాస్ అర టీ స్పూను, ఉల్లి పాయ ఒకటి, అల్లం వెల్లుల్లి 2 టీ స్పూన్లు, పచ్చి మిర్చి ముద్ద టీ స్పూను, వెనిగర్ అర టీ స్పూను, టొమాటో సాస్ 2 టేబల్ స్పూన్లు, చిల్లీ సాస్ అర టీ స్పూను, నూనె.

**తయారు చేయు విధానం:**

బఠానీలు ఉడికించి ఉంచుకోవాలి. ఉడికించిన బంగాళాదుంప పొట్టు తీసి మెత్తగా మెదిపి ఉంచుకోవాలి. అందులోనే క్యాబేజి తురుము ఉడికించిన బఠానీ, అన్నం, ఉప్పు మరియు ఎండు మిర్చి వేసి మెత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఉండలుగా చేసి మైదా పిండిలో దొర్లించాలి.

కడాయిలో నూనె వేడి చేసుకొని చేసుకున్నఉండల్ని ఎర్రగా వేయించుకొని తీసుకోవాలి. ఇంకొక బాణలిలో కొద్దిగా నూనె వేసుకొని ఉల్లి వేయించుకోవాలి. వేగాక అల్లం వెల్లుల్లి, పచ్చి మిర్చి, కొత్తిమీర తురుము, వెనిగర్, సోయా సాస్, టొమాటో సాస్, ఉప్పు వేసి ఒక సారి రైస్ బాల్స్ వేసి తియ్యలి. పైన కొద్దిగా వెల్లుల్లి, కొత్తిమీర గార్నిష్ చేసి వడ్డిస్తే బాగా ఆవురావురుమంటూ పిల్లలు పెద్దలు లాగించేస్తారు.

**– అనురాధ ప్రతికంటం**

# 2013 పునర్విమర్శ(చిత్ర మాలిక)

తెలుగు సమితి జరిపిన కార్యక్రమముల లోని కొన్ని చిత్రాలు మన కోసం...



సంక్రాంతి సంబరాలు—2014

రంగవల్లుల పోటీ





శాస్త్రీయ సంగీత గానము

సంగీత విభావరి






చిన్న పిల్లల ప్రదర్శన—సంక్రాంతి

సంక్రాంతి పాటలు



# 2013 పునర్విమర్శ(చిత్ర మాలిక)

వాషింగ్టన్ తెలుగు సమితి జరుపుతున్న అన్నీ కార్యక్రమములను విజయవంతం చేస్తున్న తెలుగు బంధులకు ధన్యవాదాలు.



శాస్త్రీయ నృత్యం

శాస్త్రీయ నృత్యము





శ్రీ కృష్ణ విలాసము—సంక్రాంతి

భోగి పళ్ళు





తెలుగు సమితి పూర్వ సభ్యుల సత్కారం

కోలాటం




Suveen Vuppala
Real estate agent
Phone: 425-445-4604
" If you or your friend is in the market buying a home in Bellevue, Issaquah, Sammamish, Redmond areas, I am here to help you to find your dream home"
"Special Incentives/Credits for WATS Life/Annual members"
"Successfully closed hundreds of homes in Puget Sound areas for the past 6 years"
"For all your real estate needs, please contact: SuveenVuppala, Email: suveenv@ gmail.com, Tel# 425-445-4604"
for fun home buying experience....
ఉగాది శుభాకాంక్షలు